సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
మంగళవారం, 11.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 281
పేజీలు: 08 వెల: రూ. 5

## శ్రీచైతన్యలో
# ర్యాగింగ్ భూతం..
### కర్రలతో కొట్టి.. బూట్లతో ముఖంపై తొక్కి విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి



- ఒక్కడిని చేసి 12 మంది దాడి
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి
- ఘటనను దాచిపెట్టేందుకు యాజమాన్యం ప్రయత్నించిందని తల్లిదండ్రుల ఫిర్యాదు

**ముద్ర, హైదరాబాద్:**
చదువుకోవాల్సిన వయసులో విద్యార్థుల మధ్య ర్యాగింగ్ పేరుతో చోటుచేసుకున్న దాడి కలకలం రేపుతోంది. హాస్టల్లో ఉంటూ పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిపై సుమారు 12 మంది సీనియర్ విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేసినట్లు ఆరోపణలు రావడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. కర్రలు, ప్లేట్లతో విచక్షణారహితంగా కొట్టడంతో పాటు బూట్లతో ముఖంపై తొక్కారని బాధితుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం తీవ్ర గాయాలతో బాధిత విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.
ఈ ఘటన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడలోని శ్రీచైతన్య హైస్కూల్ హాస్టల్‌లో జరిగినట్లు తెలుస్తోంది. కామారెడ్డి జిల్లాకు చెందిన పదో తరగతి విద్యార్థి అభిషేక్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. రాత్రి సమయంలో ర్యాగింగ్ పేరుతో కొంతమంది సీనియర్ విద్యార్థులు తనపై దాడి చేసినట్లు అభిషేక్ తన తల్లిదండ్రులకు తెలిపినట్లు సమాచారం. కర్రలు, ప్లేట్లతో కొట్టడంతో పాటు బూట్లతో ముఖంపై తొక్కినట్లు అతడు చెప్పినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. అయితే ఘటనపై పాఠశాల యాజమాన్యం చెప్పిన వివరాలు దీనికి పూర్తి భిన్నంగా ఉన్నాయని బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమ కుమారుడు హాస్టల్ మెట్లపై నుంచి జారిపడి కిందపడటంతో గాయపడ్డాడని స్కూల్ యాజమాన్యం ఫోన్ ద్వారా తమకు సమాచారం ఇచ్చిందని వారు తెలిపారు. దీంతో వెంటనే పాఠశాలకు వెళ్లి అభిషేక్‌ను ఇంటికి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఇంటికి వచ్చిన తర్వాత అతడి పరిస్థితి విషమంగా కనిపించడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు మిగతా 02లో

## మావోయిస్టు కంచుకోటలో డీజీపీ
కర్రిగుట్టలో పర్యటించిన సీవీ ఆనంద్




- మావోయిస్టు స్థావరం నుంచి పర్యాటక కేంద్రంగా కర్రిగుట్ట
- 50 ఏళ్ల తర్వాత శాంతి.. అభివృద్ధికి శ్రీకారం
- రహదారి పనులను పరిశీలించిన డీజీపీ
- మావోయిస్టుల లొంగుబాటుకు పునరావాస చర్యలు
- సీఆర్పీఎఫ్ సేవలను అభినందించిన సీవీ ఆనంద్

03

## రాంచీకి కదం తొక్కిన విద్యార్థులు
### పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల రాజీనామా..

- జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ అభ్యర్థుల ఆందోళన
- 13 పరీక్షల్లో అక్రమాలపై విద్యార్థుల పోరు
- విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్.. టియర్ గ్యాస్
- పరీక్షల అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్

02



## భూమిలో దాచిన రూ.5లక్షలు
### కుళ్లి, చిరిగిపోయిన నోట్లు



- దాచిన డబ్బు మరిచిపోయాడు..
- తవ్వితే బయటపడ్డ రూ.5 లక్షలు!
- కష్టపడి సంపాదించిన డబ్బే కొంపముంచింది!
- తెరిచిచూస్తే రూ.5 లక్షలు చెదలపాలు..
- రైతుకు మిగిలిన తీవ్ర నిరాశ

03



# కట్నం కొత్త రూపమా?
### పెళ్లి కోసం రూ.3 కోట్ల ఆస్తులు డిమాండ్?
### అమ్మాయి పేరుపై ఆస్తులు రాస్తేనే పెళ్లి..

- వైరల్‌గా మారిన రెడిట్ పోస్ట్
- అరేంజ్డ్ మ్యారేజ్‌లో షాకింగ్ డిమాండ్..
- పెళ్లి సంబంధం కుదరాలంటే ఆస్తులు రాయాల్సిందేనా?
- కోట్ల ఆస్తుల డిమాండ్‌పై విమర్శలు

*రూ. 2 కోట్ల ఆస్తి అమ్మాయి పేరిట రాస్తేనే తాళిబొట్టు బంధం.. లేదంటే శుభలేఖలు క్యాన్సిల్! అరేంజ్డ్ మ్యారేజ్‌ల పేరిట నడుస్తున్న ఈ కొత్త 'ఆస్తి స్కెచ్' చూసి నెటిజన్లు నివ్వెరపోతున్నారు. రూ. 2 నుంచి 3 కోట్ల విలువైన ఆస్తులు పెండ్లి పిల్లకు బదిలీ చేస్తేనే పెళ్లి పీటలు ఎక్కుతుందట.... లేదంటే శుభలేఖలు క్యాన్సిల్! సమాజంలో కట్నకానుకల డిమాండ్లు చూశాం గానీ, అరేంజ్డ్ మ్యారేజ్ మార్కెట్‌లో వెలుగుచూసిన ఈ 'కోట్ల ఆస్తి స్కెచ్' చూసి నెటిజన్ల మైండ్ బ్లాక్ అవుతోంది. అసలు ఇది పవిత్రమైన పెళ్లి బంధమా లేక పక్కాగా ప్లాన్ చేసిన భారీ ఆర్థిక లావాదేవీయా అంటూ సోషల్ మీడియా షేక్ అవుతోంది!*

03



## పాలమూరుకు
# కేంద్రం షాక్
### పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా లేనట్లే!
### సాంకేతిక అనుమతుల పరిశీలనకు బ్రేక్

- డీపీఆర్ వెనక్కి పంపిన కేంద్రం
- పాలమూరు ప్రాజెక్టుకు అడ్డంకులు
- కృష్ణా జల వివాదమే అడ్డంకి
- కేంద్ర నిధులపై ఇంకా తుది నిర్ణయం లేదు
- ట్రిబ్యునల్‌లో తేలేవరకు ప్రసక్తి లేదన్న జలశక్తి శాఖ
- రాజ్యసభలో స్పష్టం చేసిన కేంద్రం




**ముద్ర డెస్క్:**
తెలంగాణ రాష్ట్రానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (PRLIS) కు కేంద్ర ప్రభుత్వం నుంచి మరోసారి నిరాశ ఎదురైంది. ఈ ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించే ప్రతిపాదన ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని కేంద్రం స్పష్టం చేసింది. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుక చౌదరి అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయాన్ని వెల్లడించింది. దీంతో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు భవిష్యత్తుపై మరోసారి అనిశ్చితి నెలకొంది.

**కృష్ణా జల వివాదాలే ప్రధాన అడ్డంకి**
కృష్ణా నదీ జలాల వినియోగం, పంపిణీకి సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఉన్న అంతర్రాష్ట్ర వివాదాలు ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్–II పరిధిలో ఉన్నాయని కేంద్రం పేర్కొంది. ఈ అంశాలు తేలే వరకు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన టెక్నో–ఎకనామిక్ అప్రైజల్ చేపట్టడం సాధ్యం కాదని స్పష్టం చేసింది.

**డీపీఆర్ వెనక్కి..**
ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (DPR)ను కేంద్రం వెనక్కి పంపింది. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పొందుపరిచి, అవసరమైన స్పష్టతలతో కొత్తగా డీపీఆర్ సమర్పించాలని సూచించింది. దీంతో ఇప్పటికే భారీ వ్యయంతో కొనసాగుతున్న ప్రాజెక్టుకు కేంద్ర స్థాయిలో మరో అడ్డంకి ఎదురైనట్టయింది.

**కేంద్ర నిధులపైనా క్లారిటీ లేదు**
పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించే అంశంపైనా ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని కేంద్రం స్పష్టం చేసింది. అంటే జాతీయ హోదా మాత్రమే కాదు.. కేంద్ర నిధుల విషయంలోనూ తెలంగాణకు ప్రస్తుతానికి స్పష్టత లభించలేదు.

**జాతీయ హోదాకు కేంద్రం చెప్పిన నిబంధనలు**
జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించేందుకు నిర్దేశిత మార్గదర్శకాలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. ప్రాజెక్టుకు జాతీయ ప్రాధాన్యం ఉండటంతో పాటు, అంతర్రాష్ట్ర లేదా అంతర్జాతీయ జల వివాదాలు లేకపోవడం, గణనీయమైన సాగునీటి సామర్థ్యం కలిగి ఉండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించింది.

**ముందు ఏం జరగాలి?**
కృష్ణా జలాలపై ఉన్న వివాదాలు, ట్రిబ్యునల్ పరిధిలోని అంశాలు మిగతా 02లో

## వానలు కురవాలి
### సాగర తీరంలో వరుణయాగం
108 మంది రుత్విక్కులతో 11 హోమగుండాల్లో యాగ క్రతువు..
పూర్ణాహుతిలో సీఎం రేవంత్ దంపతులు

02



కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్ష..

## సమస్యలు పరిష్కరిస్తేనే
# జనాలు జై కొడతారు



### రౌడీలకు సింహస్వప్నంగా ఉంటా

- భూ సమస్యలు పరిష్కరించాల్సిందే
- ఏడు నెలల్లో పాస్‌పుస్తకాల ప్రక్రియ పూర్తి
- అభివృద్ధికి అడ్డొస్తే ఊరుకోం
- ఏపీ సీఎం చంద్రబాబు

02

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం, 11.08.2026
www.mudranews.in | @mudranews



## కడుపు ఉబ్బరం : నెమ్మదిగా తినండి



ఆహారాన్ని వేగంగా తినడం వల్ల ఎక్కువ గాలిని మింగే అవకాశం ఉంటుంది. దీంతో కడుపులో గ్యాస్ పెరిగి ఉబ్బరంగా అనిపించవచ్చు. అందుకే ఆహారాన్ని చిన్న ముద్దలుగా తీసుకుని బాగా నమిలి నెమ్మదిగా తినడం మంచిది.

# పాలమూరుకు కేంద్రం షాక్..



(మొదటి పేజీ తరువాయి)
పరిష్కారం కావడంతో పాటు అవసరమైన క్లియరెన్సులు లభిస్తేనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్రతిపాదనను కేంద్రం తదుపరి దశలో పరిశీలించే అవకాశం ఉంటుంది. అప్పటి వరకు జాతీయ హోదా, కేంద్ర నిధులు, సాంకేతిక-ఆర్థిక పరిశీలనపై స్పష్టత వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.
మొత్తంగా.. తెలంగాణ సాగునీటి రంగంలో కీలకమైన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్రం తాజా సమాధానం గట్టి ఎదురుదెబ్బగా మారింది. కృష్ణా జల వివాదాలు ఎప్పుడు పరిష్కారమవుతాయి? కేంద్రం ఎప్పుడు సానుకూల నిర్ణయం తీసుకుంటుంది? ప్రాజెక్టుకు జాతీయ హోదా, కేంద్ర నిధులు ఎప్పుడు వస్తాయి? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాంశంగా మారాయి.

# రాంచీకి కదం తొక్కిన విద్యార్థులు

**ముద్ర, ఢిల్లీ :**
జార్ఖండ్ రాజధాని రాంచీలో రిక్రూట్‌మెంట్ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ నిర్వహించిన 'అసెంబ్లీ మార్చ్' తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వేలాది మంది జేపీఎస్సీ (JPSC), జేఎస్ఎస్సీ (JSSC) అభ్యర్థులు చేపట్టిన ఈ ముట్టడి కార్యక్రమంలో పోలీసులు నిరసనకారులను అడ్డుకోవడానికి లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను ప్రయోగించారు. జగన్నాథ్‌పూర్ ఆలయం సమీపంలోని చివరి బారికేడ్‌ను నిరసనకారులు దాటుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుని పలువురు అభ్యర్థులు గాయపడ్డారు. పోలీసులు నీటి ఫిరంగులను విచక్షణారహితంగా ఉపయోగించినప్పటికీ, కొంతమంది విద్యార్థులు నిరసన స్థలంలోనే ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ తమ నిరసనను వినూత్నంగా తెలిపారు. ఈ ఆందోళనల తీవ్రత కారణంగా రాష్ట్ర అసెంబ్లీ మధ్యాహ్నానికి వాయిదా పడింది.
ఈ ఉద్రిక్తతల నడుమ జార్ఖండ్ సీఐడీ (CID) కీలక చర్యలు తీసుకుంది. నియామక పరీక్షల అక్రమాల కేసులో జేపీఎస్సీ మాజీ చైర్మన్ ఎల్. ఖియాంగ్తేను సోమవారం నాడు పోలీసులు అరెస్ట్ చేశారు. జులై 22న రాజీనామా చేసిన ఆయనను సీఐడీ అధికారులు ఇదివరకే నాలుగుసార్లు విచారించారు. కేసు విచారణలో భాగంగా ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 20కి చేరింది. ఈ అరెస్టుకు ఒక్క రోజు ముందే జేపీఎస్సీకి చెందిన ముగ్గురు సభ్యులు కూడా తమ పదవులకు రాజీనామా చేయడం గమనార్హం. తొమ్మిది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ 10.5 కిలోల బరువు తగ్గిన జేఎల్కేఎం నాయకుడు దేవేంద్రనాథ్ మహతో కూడా అంబులెన్స్‌లోనే ఈ మార్చ్‌లో పాల్గొనడం అభ్యర్థుల పట్టుదలకు నిదర్శనంగా నిలిచింది. మొత్తం 13 పరీక్షల్లో అక్రమాలు జరిగాయని.. వీటిపై సీబీఐ విచారణ చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.
మరోవైపు ఈ నిరసనల వ్యవధిలో రాజకీయం కూడా వేడెక్కింది. జార్ఖండ్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఉద్యోగాల సమస్యలు, పరీక్షల అక్రమాలపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ "ద్వంద్వ నీతిని" అవలంబిస్తున్నాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది, తరుణ్ చుగ్ తీవ్రంగా విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమాలను రాజకీయంగా వాడుకోవడానికి ప్రయత్నించిన రాహుల్ గాంధీ, ఇప్పుడు జార్ఖండ్‌లో జరుగుతున్న ఆందోళనలపై మౌనంగా ఉన్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.



# కరువుతీరా వానలు కురవాలి

## సాగర తీరంలో వరుణయాగం



**ముద్ర, నాగార్జునసాగర్:**
రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని, కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని జలాశయాలు జలకళతో నిండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్‌లో వరుణయాగం నిర్వహించింది. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ పవిత్ర యాగ క్రతువు ఘనంగా జరిగింది. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వరుణయాగాన్ని నిర్వహించారు.

**108 మంది రుత్వికులు..**
**11 హోమగుండాలు**
వరుణయాగంలో భాగంగా మొత్తం 11 హోమగుండాలను ఏర్పాటు చేసి 108 మంది రుత్వికులతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. యాదగిరిగుట్ట ఆలయ అర్చకులు, వేద పండితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం యాగ క్రతువులను ప్రారంభించారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు మేలు జరగాలని, సాగునీటి ప్రాజెక్టులు, జలాశయాల్లోకి సమృద్ధిగా నీరు చేరాలని యాగంలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు.

**గోపూజతో ప్రారంభం**
వరుణయాగ కార్యక్రమాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి పద్మావతి రెడ్డి దంపతులు ప్రారంభించారు. ముందుగా గోపూజ, విశ్వక్సేన పూజ నిర్వహించి యాగశాలలోకి ప్రవేశించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య హోమ క్రతువులు కొనసాగాయి. యాగ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**పూర్ణాహుతిలో సీఎం రేవంత్ దంపతులు**
వరుణయాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సతీమణి గీత పాల్గొన్నారు. యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

**పలువురు మంత్రులు,**
**ప్రజాప్రతినిధుల హాజరు**
వరుణయాగ కార్యక్రమానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తదితరులు హాజరయ్యారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

**జలాశయాలు నిండాలని ఆకాంక్ష**
కృష్ణా, గోదావరి నదుల పరివాహక ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి జలాశయాలు నిండాలని, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు మేలు జరగాలని వరుణయాగం సందర్భంగా ఆకాంక్షించారు. నాగార్జునసాగర్ తీరంలో నిర్వహించిన ఈ యాగం భక్తిశ్రద్ధలతో సాగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, హోమగుండాల నుంచి వెలువడిన పవిత్ర అగ్నిజ్వాలల మధ్య పూర్ణాహుతి ఘనంగా ముగిసింది.



# రిఫార్మ్ ఉత్సవ్

**హైదరాబాద్, ఆగస్టు 10:**
ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాలనలో సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం 'రిఫార్మ్ ఉత్సవ్' కార్యక్రమాన్ని చేపట్టనుంది. అక్టోబర్ 2026లో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంపై కేబినెట్ సెక్రటరీ డా. టి.వి. సోమనాథన్ సోమవారం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలు, వివిధ వర్గాల నుంచి వచ్చే సూచనలు, సమస్యలను గుర్తించి.. వాటిపై చర్చించి.. అమలు చేయగల సంస్కరణలుగా మార్చడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.
మూడు దశల్లో కార్యక్రమం
'రిఫార్మ్ ఉత్సవ్'ను మూడు దశల్లో నిర్వహించనున్నారు. ఆగస్టు–సెప్టెంబర్ 2026లో తొలి దశగా సన్నాహక కార్యక్రమాలు చేపడతారు. ఇందులో గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు, ప్రజల్లో అవగాహన కల్పించడం, అధికారులకు కార్యక్రమంపై అవగాహన కల్పించడం వంటి చర్యలు ఉంటాయి.
రెండో దశలో భాగంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ప్రధాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్టోబర్ 1 నుంచి 31 వరకు 'జన్ మంథన్' పేరుతో ప్రజల సమస్యలు, సూచనలను సేకరిస్తారు. అనంతరం అక్టోబర్ 10 నుంచి నవంబర్ 30 వరకు 'విమర్శ్', 'జన్ సమాధాన్' కార్యక్రమాల ద్వారా సూచనలపై చర్చించి, తక్షణ మరియు మధ్యకాలిక సంస్కరణలను అమలు చేస్తారు. అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 20 వరకు 'సంకల్ప సిద్ధి' కార్యక్రమం కింద జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక సంస్కరణ కార్యక్రమాలను చేపడతారు.
మూడో దశలో భాగంగా డిసెంబర్ 28, 2026 నుంచి సంస్కరణల అమలుపై నిరంతర పర్యవేక్షణ, ఫాలోఅప్ నిర్వహించనున్నారు.
సీఎస్ నేతృత్వంలో కమిటీలు
ప్రతి రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన స్టేట్ కోఆర్డినేటివ్ కమిటీ (SCC) ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమం అమలును పర్యవేక్షించేందుకు ★★స్టేట్ నోడల్ ఆఫీసర్ (SNO)★★ను నియమిస్తారు. జిల్లా స్థాయిలోనూ అవసరమైన నోడల్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.
ప్రాంతీయ భాషల్లో పోర్టల్
ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ★★'రిఫార్మ్ ఉత్సవ్ పోర్టల్'★★ను అందుబాటులోకి తీసుకురానుంది. ప్రజల సూచనల సేకరణ, వాటి పర్యవేక్షణ, సమన్వయం తదితర కార్యకలాపాలను ఈ పోర్టల్ ద్వారా నిర్వహిస్తారు. ప్రాంతీయ భాషల్లోనూ పోర్టల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.
తెలంగాణ నుంచి ఉన్నతాధికారుల పాల్గొనడం
వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ నుంచి చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజుతో పాటు నవీన్ మిట్టల్, స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్, బి. పాపిరెడ్డి, అనుదీప్ దురిశెట్టి, అహ్మద్ నదీమ్, మహేశ్ దత్ ఎక్కా, గౌరవ్ ఉప్పల్, స్వాతి లక్రా, దేవసేన, దివ్య దేవరాజన్ తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్యలో ర్యాగింగ్ భూతం

(మొదటి పేజీ తరువాయి)
ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అభిషేక్ తనపై జరిగిన దాడి గురించి తల్లిదండ్రులకు వివరించినట్లు తెలుస్తోంది. ర్యాగింగ్ పేరుతో సీనియర్ విద్యార్థులు తనపై దాడి చేశారని చెప్పడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటనపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తమ కుమారుడిపై దాడికి పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఘటనను వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయకుండా మెట్లపై నుంచి పడిపోయిన ప్రమాదంగా చెప్పేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై పాఠశాల యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన హాస్టల్‌లోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఇప్పుడు ప్రశ్నలను లేవనెత్తుతోంది. నిజంగా ర్యాగింగ్ కారణంగానే దాడి జరిగిందా? ఎంతమంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు? ఘటన జరిగిన సమయంలో హాస్టల్ సిబ్బంది ఎక్కడ ఉన్నారు? పాఠశాల యాజమాన్యానికి విషయం ఎప్పుడు తెలిసింది? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తులో ఈ ప్రశ్నలకు సమాధానాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.




# సమస్యలు పరిష్కరిస్తేనే జనాలు జై కొడతారు



**ముద్ర, అమరావతి :**
ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సుపరిపాలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఏలూరు జిల్లా కలిదిండిలో నిర్వహించిన 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు.. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెవెన్యూ, భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే వరకు అధికారులు కష్టపడి పనిచేయాలని ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకాలకు అత్యాధునిక భద్రతా ఫీచర్లు కల్పిస్తున్నామని తెలిపారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి సాంకేతికతతో ఆస్తుల వివరాలను ట్యాంపరింగ్‌కు గురికాకుండా రక్షిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 32.32 లక్షల పాస్ పుస్తకాలను రైతులు, భూ యజమానులకు అందించామని.. 9,365 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని వెల్లడించారు. మిగిలిన ప్రక్రియను ఏడు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు.
"సమస్యలు పరిష్కరిస్తేనే జనాలు జై కొడతారు. లేకపోతే గతంలో ఏం జరిగిందో చూశాం" అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి నెలా సమావేశాల ద్వారా వారిని కలుస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో రౌడీయిజం, ముఠా కక్షలను అణచివేశామని చంద్రబాబు అన్నారు. "నేను రౌడీయిజం చేయను.. రౌడీలకు సింహస్వప్నంగా ఉంటా" అని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి ఎవరైనా అడ్డొస్తే సహించబోమని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు. డీఎస్సీ విషయంలో వైకాపా చేస్తున్న దుష్ప్రచారాన్ని కూడా చంద్రబాబు తప్పుబట్టారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియపై ఆ పార్టీ తప్పుడు ప్రచారాలను టీచర్లే తిప్పికొట్టారని పేర్కొన్నారు. టీచర్లు సవాల్ విసిరినా వైకాపా నిరసనలు కొనసాగించడం సిగ్గుచేటని విమర్శించారు.

# ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తు గడువు పొడిగింపు

**ముద్ర, హైదరాబాద్:**
హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆగస్టు 15వ తేదీ శనివారం వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.
అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చి, నామమాత్రపు ధరలోనే పేద, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇంటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పథకం ద్వారా లక్ష ఇళ్లను నిర్మిస్తున్నామని, అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని ఆయన వివరించారు.
ఇందిరమ్మ ఇండ్లు టవర్స్పై ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని, పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే రెండో శనివారం, బోనాల పండుగ తదితర వరుస సెలవుల కారణంగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా గడువు పొడిగించాలంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగించి ఆగస్టు 15 వరకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.
తొలుత ప్రకటించిన ప్రకారం దరఖాస్తుల స్వీకరణ గడువు ఆగస్టు 10, సోమవారం వరకు ఉంది. గత నెల జూలై 21వ తేదీ నుంచి మీ–సేవా కేంద్రాలతో పాటు ఆన్‌లైన్ ద్వారా, మీ–సేవా వాట్సాప్ సేవ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆగస్టు 10, సోమవారం సాయంత్రం నాటికి మొత్తం 46,121 దరఖాస్తులు అందినట్లు మంత్రి తెలిపారు.
వరుసగా సెలవులు రావడంతో మరింత మంది అర్హులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో గడువు పొడిగించినట్లు మంత్రి పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.
దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచినప్పటికీ, దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, కేటాయింపు, లాటరీ తదితర ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెలాఖరు నాటికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.
ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై దరఖాస్తుదారులు ఎటువంటి అపోహలు, అనుమానాలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియను నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తులు**

| నియోజకవర్గం | దరఖాస్తులు |
|---|---|
| అంబర్‌పేట | 3,073 |
| బహదూర్‌పుర | 1,706 |
| ఇబ్రహీంపట్నం | 1,031 |
| కార్వాన్ | 2,184 |
| ఖైరతాబాద్ | 5,518 |
| కూకట్‌పల్లి | 6,615 |
| మహేశ్వరం | 734 |
| మలక్‌పేట | 3,609 |
| మల్కాజిగిరి | 1,333 |
| మేడ్చల్ | 1,668 |
| నాంపల్లి | 4,372 |
| కుత్బుల్లాపూర్ | 5,571 |
| రాజేంద్రనగర్ | 2,060 |
| సనత్‌నగర్ | 1,404 |
| కంటోన్మెంట్ | 1,755 |
| శేరిలింగంపల్లి | 3,488 |
| మొత్తం | 46,121 |

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 11.08.2026
www.mudranews.in | @mudranews



### కడుపు ఉబ్బరం : గ్యాస్ పెంచే ఆహారాలను తగ్గించండి

బీన్స్, శనగలు, క్యాబేజీ, ఉల్లిపాయలు, కార్బొనేటెడ్ డ్రింక్స్ వంటి కొన్ని ఆహారాలు కొందరిలో గ్యాస్, ఉబ్బరాన్ని పెంచవచ్చు. ఏ ఆహారం తిన్న తర్వాత ఇబ్బంది ఎక్కువగా ఉంటుందో గమనించి, దాన్ని పరిమితంగా తీసుకోవడం ఉపయోగకరం.



# మావోయిస్టు కంచుకోట కర్రిగుట్టలో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన

**మావోయిస్టు స్థావరం నుంచి పర్యాటక కేంద్రంగా కర్రిగుట్ట**
**50 ఏళ్ల తర్వాత శాంతి.. అభివృద్ధికి శ్రీకారం**
**రహదారి పనులను పరిశీలించిన డీజీపీ**
**మావోయిస్టుల లొంగుబాటుకు పునరావాస చర్యలు**
**సీఆర్పీఎఫ్ సేవలను అభినందించిన సీవీ ఆనంద్**




**ముద్ర, ములుగు** : ఒకప్పుడు మావోయిస్టుల కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న తెలంగాణ–ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులోని కర్రిగుట్టలో ఇప్పుడు శాంతి నెలకొనడంతో అభివృద్ధి, పర్యాటక మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం కర్రిగుట్టను సందర్శించిన డీజీపీ సీవీ ఆనంద్.. మారుమూల అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, శాంతికి ప్రతీకగా తెల్ల పావురాలను ఎగురవేశారు. పోలీస్, సీఆర్పీఎఫ్, అటవీ, రెవెన్యూ, పర్యాటక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన డీజీపీ.. తెలంగాణ పోలీస్, గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీస్ బలగాలు, సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల వల్ల ఈ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు.

ఆపరేషన్ కగార్ సమయంలో దాదాపు 700 మంది మావోయిస్టులు లొంగిపోయారని, పలువురు కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో మృతి చెందగా.. మరికొందరు జనజీవన స్రవంతిలోకి తిరిగి వచ్చారని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం కొద్దిమంది కేంద్ర కమిటీ స్థాయి నేతలు మాత్రమే క్రియాశీలకంగా ఉన్నారని తెలిపారు.

లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని డీజీపీ వివరించారు. ఆర్థిక సహాయం, భూమి కేటాయింపు, జీవనోపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారు సమాజంలో తిరిగి స్థిరపడేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

**పర్యాటక కేంద్రంగా కర్రిగుట్ట**

కర్రిగుట్టకు అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నాయని సీవీ ఆనంద్ తెలిపారు. పర్యావరణ, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

పాములూరు నుంచి చలమాదవ వరకు తారు రోడ్డు పనులు పూర్తయ్యాయని, త్వరలో బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రహదారి కనెక్టివిటీ మెరుగుపరచడంతో పాటు విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్, ఇతర మౌలిక వసతులను కల్పించి పర్యాటక అభివృద్ధికి అనుకూల వాతావరణం సృష్టించనున్నట్లు చెప్పారు.

పాములూరు క్యాంపు సమీపంలో నివసిస్తున్న గుత్తి కోయ కుటుంబాలకు డీజీపీ నిత్యావసర సరుకులను పంపిణీ చేసి, ప్రభుత్వం నుంచి నిరంతర సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**సీఆర్పీఎఫ్ సేవలకు ప్రశంసలు**

మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల్లో దశాబ్దాలుగా రాష్ట్ర పోలీసులతో కలిసి పనిచేస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది సేవలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

కఠినమైన అటవీ ప్రాంతాల్లో 196వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ సిబ్బంది నెలల తరబడి కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహిస్తున్నారని, వారి అంకితభావం, వృత్తి నైపుణ్యం ఈ ప్రాంతంలో శాంతి పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ సంజయ్ జైన్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, ఎస్ఐబీ ఎస్పీ సింధు శర్మ, ములుగు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, సీఆర్పీఎఫ్ అధికారులు, రెవెన్యూ, పర్యాటక శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

**- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**ముద్ర, న్యూఢిల్లీ** : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ లో ఆల్ ఇండియా దళిత్ క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. 1950 లో జారీ చేసిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్ కారణంగా మతం మారిన దళితులకు ఎస్సీ హోదా దూరమవుతోందని ఆయన పేర్కొ న్నారు. ఈ ఆర్డర్‌ను రద్దు చేసి దళిత క్రైస్తవు లు, ముస్లింలకు సమాన హక్కులు కల్పిం చాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 13, 15, 25 ప్రకారం హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. దమ్ముంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ అంశంపై మోదీతో మాట్లాడాలని సవాల్ చేశారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ ఈ పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రవీణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కూడా పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఊరుకోం

**- రామచందర్‌రావు**

**ముద్ర, హైదరాబాద్**: పరిపాలనలో లోపంతోనే అధికారులపై ఆరోపణలు వస్తున్నాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. సల్కమ్ చెరువులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కోర్టులను కూడా అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. న్యాయస్థానాల ఆదేశాలున్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో మీడియాతో రామచందర్‌రావు చిట్‌చాట్ నిర్వహించారు.

# భూములకూ 'భూధార్'

- **ప్రతి అంగుళం సర్వే**
- **భూముల ప్రక్షాళనకు భూభారతి.. రైతులకు భరోసా**
- **రాష్ట్రంలోని భూములన్నింటికీ భూధార్**
- **భూముల భద్రతే లక్ష్యం.. భూధార్‌తో రక్షణ**
- **మంత్రి పొంగులేటి**



**ముద్ర, హనుమకొండ** : జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్బాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు.

ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# భూమిలో దాచిన రూ.5 లక్షలు.. చివరికి చిత్తు!

- **దాచిన డబ్బు మరిచిపోయాడు..**
- **తవ్వితే బయటపడ్డ రూ.5 లక్షలు!**
- **తెరిచిచూస్తే రూ.5 లక్షలు చెదలపాలు..**
- **రైతుకు మిగిలిన తీవ్ర నిరాశ**



**ముద్ర, ఢిల్లీ :** ఎండ.. వాన.. చలి.. దేనితో సంబంధం లేకుండా భూమిని దున్నడం.. కష్టపడి పంట సాగు చేయడం.. సాగు చేసిన పంటను అమ్ముకోవడం.. ఇది మాత్రమే రైతుకు తెలుసు. పంటను పండించే క్రతువులో రైతు ఎన్నో కష్టాలు పడతాడు. మరెన్నో ఇబ్బందులు ఎదుర్కొంటాడు. అయినప్పటికీ వాటన్నింటిని ఎంతో ఇష్టంతో స్వీకరించి.. రైతు అనే పదాన్ని సార్ధకం చేసుకుంటాడు.

ఇంత కష్టపడి పంట పండించినప్పటికీ రైతుకు గిట్టుబాటు అనేది ఉండదు. అతడు చేసిన శ్రమకు విలువ లభించదు. ప్రభుత్వాలు పట్టించుకోవు. సమాజం లెక్క చేయదు. రైతు అంటేనే ఒక చులకనగా చూస్తుంటారు. వ్యవసాయం అనే పదాన్ని బూతు లాగా భావిస్తుంటారు. కానీ ఆ రైతు పంట పండించకుండా ఉంటే.. వ్యవసాయం ముందుకు సాగకుండా ఉంటే.. మనదేశమే కాదు ప్రపంచం మొత్తం పస్తులు ఉండాల్సిందే.. ఆకలితో ఇబ్బంది పడాల్సిందే. ఎంతో కష్టపడి పంటలు సాగుచేసి.. డబ్బులు సంపాదించే రైతులు.. వాటిని అత్యంత జాగ్రత్తగా దాచుకుంటారు. అందులో నుంచి ఒక పైసా కూడా ఖర్చు పెట్టడానికి ఒప్పుకోరు. రాజస్థాన్లోని బలోత్ర ప్రాంతంలో మంగిలాల్ అనే రైతు కూడా ఇలానే పంటలు పండించి డబ్బులు సంపాదించాడు.. ఆ డబ్బులతో ఒక ప్లాట్ కొనుగోలు చేశాడు. ఆ ప్లాట్ కు ఇటీవల ధర పెరిగింది. దీంతో దానిని అతడు అమ్ముకున్నాడు. దానిని అమ్ముకుంటే అతనికి ఐదు లక్షల దాకా వచ్చాయి. ఆ డబ్బులను అతడు భూమి లోపల దాచుకున్నాడు. ఆ ప్రాంతంలో దొంగలు విపరీతంగా ఉంటారు. అందువల్లే అతడు దాచుకున్నాడు. అయితే అతడు డబ్బులు దాచుకున్న విషయాన్ని పూర్తిగా మర్చిపోయాడు. ఇటీవల తన భూమి చుట్టూ కంచె నిర్మించడానికి తవ్వకాలు చేపట్టాడు. అందులో ఒక బ్యాగ్ లభించింది. ఆ బ్యాగు తెరిచి చూడగా కరెన్సీ కట్టలు కనిపించాయి. అయితే ఆ కట్టలకు చదలు పట్టింది. దీంతో సీరియల్ నెంబర్లు మొత్తం పోయాయి. ఆ నోట్లను బ్యాంకు వద్దకు తీసుకెళ్తే.. అధికారులు తీసుకోవడానికి నిరాకరించారు. దీంతో ఆ రైతు పరిస్థితి దారుణంగా మారిపోయింది. కష్టపడి సంపాదించిన డబ్బు.. భూమిలో దాచుకోవడం ఆ రైతు పాలిట శాపంగా మారింది.

# కట్నం కొత్త రూపమా?

- **పెళ్లి కోసం రూ.3 కోట్ల ఆస్తులు డిమాండ్?**
- **అమ్మాయి పేరుపై ఆస్తులు రాస్తేనే పెళ్లి..**
- **వైరల్‌గా మారిన రెడిట్ పోస్ట్**



**ముద్ర, హైదరాబాద్** : అరేంజ్డ్ మ్యారేజ్‌లో పెళ్లి సంబంధాలు కుదుర్చుకునే సమయంలో ఇరు కుటుంబాల మధ్య ఆర్థిక అంశాలు చర్చకు రావడం సాధారణమే. అయితే తాజాగా ఓ వ్యక్తి చేసిన రెడిట్ పోస్ట్ మాత్రం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. తనకు వచ్చిన పెళ్లి సంబంధంలో అమ్మాయి పేరుపై ఏకంగా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల విలువైన ఆస్తులు రాయాలని డిమాండ్ చేసినట్లు ఆ వ్యక్తి పేర్కొన్నాడు.

పెళ్లి జరగాలంటే ఆస్తులకు సంబంధించి హామీ ఇవ్వాలని అమ్మాయి కుటుంబం కోరినట్లు అతను పోస్టులో వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ విషయం నెట్టింట వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తుల జీవితాలకు సంబంధించిన నిర్ణయం కాగా, కోట్ల రూపాయల ఆస్తులను షరతుగా పెట్టడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మరోవైపు, కట్నం విషయంలో సాధారణంగా వరుడి కుటుంబాలపై ఆరోపణలు ఎక్కువగా వస్తుంటాయి. కానీ వధువు కుటుంబం నుంచి కూడా భారీ ఆర్థిక డిమాండ్లు వస్తున్నాయంటూ ఇలాంటి పోస్టులు చర్చకు రావడం ఆసక్తికరంగా మారింది. అయితే ఇది ఓ వ్యక్తి చేసిన రెడిట్ పోస్ట్ ఆధారంగా వచ్చిన కథనం మాత్రమేనని, అందులోని ఆరోపణలను స్వతంత్రంగా ధృవీకరించలేదని గుర్తుంచుకోవాలి. వివాహ బంధాన్ని ఆర్థిక లావాదేవీగా మార్చకుండా, పరస్పర అంగీకారం మరియు అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

## అమెరికాలో ఆటా మహాసభల వేదికగా ఘనంగా "మల్లేశన్న జిమ్" మూవీ టైటిల్ పోస్టర్ లాంచ్




**ముద్ర, హైదరాబాద్:** సరైన యూత్ ఫుల్ కామెడీ ఎంటర్ టైనర్ను అందిస్తే ప్రేక్ష కులు సూపర్ హిట్ చేసి పెడతారు. స రిగ్గా తెలుగు సిల్వర్ స్క్రీన్ పైకి అలాంటి సబ్జెక్టుతో వస్తున్న సినిమా "మల్లేశన్న జిమ్". కేఎల్ ఫిల్మ్ స్టూడియోస్ సమర్పణలో, కొణ తం లక్ష్మణ్ నిర్మిస్తున్న "మల్లేశన్న జిమ్" చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్ ను అమెరికాలో జరుగుతున్న అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ATA) మహాసభల వేదికగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన తెలుగు ప్రముఖులు, సినీ అభిమానుల సమక్షంలో క న్నుల పండువ గా జరిగింది. కొణతం లక్ష్మణ్ నిర్మాతగా, మోహన్ మేనంపల్లి దర్శకత్వంలో తెర కెక్కుతున్న ఈ చిత్రంలో 'కీడా కోలా' ఫేమ్ చైతన్య మాదాడి హీరోగా నటిస్తుండగా, ఆయనకు జంటగా ఒక ప్రముఖ హీరోయిన్ ను తీసుకోబోతున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ మూవీ పోస్టర్ లాంచ్ కార్యక్రమంలో ఆటా ప్రతినిధులు, MATA అసోసియేషన్ కోశాధికారి శ్రీధర్ గూడాల, USA డిస్ట్రిబ్యూటర్ మల్లిక్ బొల్లా, ఆదర్శ మ్యాట్రిమోనీ అధినేత వంగాల బాలరాజ్ గౌడ్, ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ పవన్ వంగాల, ఎన్నారై వ్యాపారవేత్త శ్యామ్ పుచ్చలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నిర్మాత కొణతం లక్ష్మణ్ మాట్లాడుతూ, "అగ్రరాజ్యం అమెరికాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఆటా మహాసభల్లో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన తెలుగు ప్రజల సమక్షంలో మా కేఎల్ ఫిల్మ్ స్టూడియోస్ నిర్మిస్తున్న 'మల్లేశన్న జిమ్' మూవీ టైటిల్ పోస్టర్ ను విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా మంచి కథ, కథనాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు, చిత్రీకరణ తదితర పూర్తి వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తాం" అని తెలిపారు.

అమెరికాలోని ప్రతిష్టాత్మక ఆటా మహాసభల వేదికపై టైటిల్ పోస్టర్ విడుదల కావడంతో "మల్లేశన్న జిమ్" చిత్రంపై సినీ వర్గాలతో పాటు ప్రేక్షకుల్లోనూ ఆసక్తి నెలకొంది.

## అక్టోబర్ నుంచి 'రిఫార్మ్ ఉత్సవ్'

**ముద్ర, హైదరాబాద్,** : ప్రజల సూచనలను ఆచరణాత్మక సంస్కరణలుగా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'రిఫార్మ్ ఉత్సవ్' కార్యక్రమం అక్టోబర్ 2026 నుంచి దేశవ్యాప్తంగా అమలు కానుంది. ఈ కార్యక్రమం అమలు, కార్యాచరణపై కేబినెట్ కార్యదర్శి డా. టి.వి. సోమనాథన్ సోమవారం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.మూడు దశల్లో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఆగస్టు–సెప్టెంబర్‌లో సన్నాహక చర్యలు, అక్టోబర్–డిసెంబర్‌లో ప్రజల భాగస్వామ్యంతో సంస్కరణల గుర్తింపు, అమలు, అనంతరం నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. ప్రతి రాష్ట్రంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్టేట్ కోఆర్డినేటివ్ కమిటీని ఏర్పాటు చేసి, నోడల్ అధికారులను నియమించనున్నారు. ప్రజల సూచనల సేకరణ, సంస్కరణల పర్యవేక్షణ కోసం ప్రత్యేక 'రిఫార్మ్ ఉత్సవ్ పోర్టల్'ను కేంద్రం అందుబాటులోకి తీసుకురానుంది. వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో మోసపూరిత కాల్ సెంటర్ల గుట్టురట్టు

ముద్ర, హైదరాబాద్: ఢిల్లీలో నిర్వహిస్తున్న మోసపూరిత సైబర్ కాల్ సెంటర్ నెట్‌వర్క్‌ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఛేదించింది. మూడు కాల్ సెంటర్లపై దాడులు నిర్వహించి 21 మంది తెలుగు మాట్లాడే మహిళా టెలీకాలర్లు, ఒక బ్యాంక్ ఖాతాదారుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిర్వాహకులు లలిత్ సింగ్, కుల్‌దీప్ సింగ్, అనిల్ పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులుగా పరిచయం చేసుకుంటూ ఆకర్షణీయమైన రుణాల పేరుతో ప్రజలను మోసం చేసినట్లు విచారణలో వెల్లడైంది. రుణ ప్రాసెసింగ్, వెరిఫికేషన్, డాక్యుమెంటేషన్, బీమా ఛార్జీల పేరుతో డబ్బులు వసూలు చేసి, అనంతరం బాధితులను బెదిరించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెట్‌వర్క్‌తో తెలంగాణలోని 22 సైబర్ నేర కేసులకు సంబంధాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. నిందితుల నుంచి 23 మొబైల్ ఫోన్లు, రెండు బ్యాంక్ పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రుణాల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మి ముందుగా డబ్బులు చెల్లించవద్దని, మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని టీజీసీఎస్‌బీ సూచించింది.

## రోడ్డు ప్రమాద బాధిత డ్రైవర్ కుటుంబానికి రూ.50 లక్షల బీమా



**ముద్ర, హైదరాబాద్:** విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురై శాశ్వత అంగవైకల్యానికి గురైన టీజీఎస్ఆర్టీసీ డ్రైవర్ ఎండీ. మదార్ కుటుంబానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో రూ.50 లక్షల బీమా సహాయం అందింది. సోమవారం హైదరాబాద్ బస్‌భవన్‌లో టీజీఎస్ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ వై. నాగిరెడ్డి, యూబీఐ సీజీఎం ఎం. రవీంద్రబాబు బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు.కరీంనగర్ జిల్లా కోరుట్ల డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న మదార్ 2025 అక్టోబర్ 9న బస్సులో కోరుట్ల నుంచి హైదరాబాద్ వస్తుండగా కుకనూర్‌పల్లి వద్ద నిలిపి ఉంచిన లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి కాలును కోల్పోయారు. యూబీఐ 'సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్' ద్వారా లభించే ఉచిత ప్రమాద బీమాతో ఈ ఆర్థిక సహాయం అందింది. ఉద్యోగుల సంక్షేమానికి టీజీఎస్ఆర్టీసీ ప్రాధాన్యత ఇస్తోందని ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 27 మంది ఆర్టీసీ సిబ్బంది కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందన్నారు.

## ఇంటి ముందు పార్కింగ్ చేసిన కారులో మంటలు.. పూర్తిగా దగ్ధం

**ముద్ర, రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కారు దగ్ధమైన ఘటన కలకలం రేపింది. శంకర్ నగర్‌లో మాధవ రెడ్డి అనే వ్యక్తి తన ఇంటి ముందు నిలిపి ఉంచిన కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఎవరో ఆకతాయిలు ఉద్దేశపూర్వకంగా కారును తగలబెట్టి ఉంటారని యజమాని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 11.08.2026
www.mudranews.in
@mudranews
mudratv



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# వరలక్ష్మీ వ్రతం ఎప్పుడు చేయాలి?

ఆగస్టు 21నా.. 28నా?

ఆషాఢ మాసం తరువాత శ్రావణ మాసం వస్తుంది. ఈ మాసంలో పూజలు, వ్రతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. ముఖ్యంగా ఈ మాసంలో వచ్చే శుక్రవారానికి ప్రత్యేకత ఉంటుంది. ఈ శుక్రవారాల్లో మహిళలు మహాలక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. వీటిలో వరలక్ష్మీ వ్రతానికి అత్యంత విశిష్ట స్థానం ఉంది. అయితే ఈ ఏడాది శ్రావణ మాసంలో ఐదు శుక్రవారాలు రావడంతో పాటు, పౌర్ణమి తిథి కూడా శుక్రవారం రోజున రావడంతో వరలక్ష్మీ వ్రతాన్ని ఏ తేదీన ఆచరించాలనే విషయంలో భక్తుల్లో సందేహం నెలకొంది.అసలు వరలక్ష్మీ వ్రతాన్ని ఎప్పుడు జరుపుకోవాలంటే?

సాధారణంగా శ్రావణ మాసంలోని పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. స్కంద పురాణం సహా పలు ధర్మగ్రంథాలు కూడా ఈ విధానాన్ని సూచిస్తున్నట్లు పండితులు చెబుతున్నారు. ధర్మశాస్త్రాల్లోని నియమాల ప్రకారం.. పౌర్ణమి తిథి శుక్రవారం రోజును స్పృశించినపుడు 'నోపాంతే భార్గవాదినే' అనే ధర్మనియమాన్ని పరిగణనలోకి తీసుకుంటారని పండితులు వివరిస్తున్నారు. ఈ నియమం ఆధారంగా పౌర్ణమితో కూడిన శుక్రవారం రోజున కూడా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించవచ్చని పలువురు పంచాంగకర్తలు చెబుతున్నారు. దీని ప్రకారం ఉదయం పూజా విధానాన్ని అనుసరించే భక్తులు 28 ఆగస్టు 2026 శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం శాస్త్రసమ్మతమే అని వారు సూచిస్తున్నారు.




అయితే అన్ని ప్రాంతాల్లో.. అన్ని కుటుంబాల్లో వరలక్ష్మీ వ్రత పూజా విధానం ఒకే విధంగా ఉండదు. కొన్ని సంప్రదాయాల్లో సాయంకాలంలో ప్రధాన పూజ నిర్వహించడం ఆనవాయితీగా ఉంటుంది. ముఖ్యంగా శృంగేరి శ్రీ శారదా పీఠం సంప్రదాయాన్ని అనుసరించే భక్తులకు ఈ విషయంలో ప్రత్యేకంగా సూచనలు ఉన్నాయి.ఆగస్టు 28న సాయంత్రం పౌర్ణమి తిథి అందుబాటులో ఉండని పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, సాయంకాల పూజా సంప్రదాయాన్ని అనుసరించేవారు ఆగస్టు 21న వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం శ్రేయస్కరం అని సూచిస్తున్నారు.

హిందూ ధర్మంలో వ్రతాలు, పూజలకు తిథి, నక్షత్రం, లగ్నం వంటి అంశాలతో పాటు కుటుంబ ఆచారం, ప్రాంతీయ సంప్రదాయం కూడా ప్రాధాన్యం కలిగి ఉంటాయి. అందువల్ల తరతరాలుగా ఏ విధానాన్ని అనుసరిస్తున్నారో తెలుసుకుని అదే పద్ధతిలో వ్రతాన్ని ఆచరించడం మంచిదని ఆధ్యాత్మిక పెద్దలు సూచిస్తున్నారు.ముఖ్యంగా ఒకే వ్రతానికి సంబంధించి వేర్వేరు పంచాంగాల్లో తేదీలు కనిపిస్తే, తమ ప్రాంతానికి వర్తించే పంచాంగాన్ని, కుటుంబ పురోహితుల సూచనలను పరిగణనలోకి తీసుకోవడం మంచిది.

# మాంసాహారం తిన్న తర్వాత ఇలా చేయాలి

వారాంతం లేదా ప్రత్యేక రోజుల్లో మాంసాహారం తినడం చాలా మందికి అలవాటు. ఇది శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, ఐరన్ వంటి పోషకాలను అందిస్తుంది. అయితే శాఖాహారంతో పోలిస్తే మాంసాహారం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది. మాంసాహారంలో ఎక్కువ నూనె ఉండడంతో దీనిని తిన్న వెంటనే కడుపు బరువుగా అనిపిస్తుంది. అయితే మాంసాహారం తిన్న తర్వాత కొన్ని అలవాట్లు పాటిస్తే జీర్ణక్రియ సులభంగా ఉండేందుకు కొన్ని టిప్స్ ఉన్నాయి.

మాంసాహారం తిన్న తర్వాత ఒక గ్లాస్ మజ్జిగ లేదా గోరువెచ్చని నీరు తాగాలి. మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్స్ పేగుల్లో మంచి బ్యాక్టీరియా పెరగడానికి సహాయపడుతాయి. గోరువెచ్చని నీరు జీర్ణక్రియను సులభతరం చేయడంలో తోడ్పడుతుంది.



భోజనం చేసిన వెంటనే సోఫాలో కూర్చోవడం లేదా మంచం పై పడుకోవడం మంచిది కాదు. బదులుగా 10 నుంచి 15 నిమిషాలు నెమ్మదిగా నడిస్తే జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. దీంతో కడుపు ఉబ్బరం, బరువుగా అనిపించడం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. అయితే భోజనం చేసిన వెంటనే వేగంగా నడవడం లేదా కఠినమైన వ్యాయామం చేయకూడదు.

మాంసాహారం తిన్న తర్వాత కొద్దిగా సోంపు నమలడం కూడా మంచి అలవాటు. సోంపులో ఉండే సహజ పదార్థాలు జీర్ణ రసాల విడుదలకు తోడ్పడతాయి. అలాగే నోటి దుర్వాసనను తగ్గించడంలో, కడుపులో గ్యాస్ ఏర్పడకుండా ఉండటంలో కూడా ఇది కొంతవరకు సహాయపడుతుంది.

రుచిగా ఉందని ఒకేసారి ఎక్కువ మాంసాహారం తినడం వల్ల జీర్ణ వ్యవస్థపై అదనపు భారం పడుతుంది. పరిమిత మోతాదులో తీసుకొని, దానికి తోడు కూరగాయలు, సలాడ్ లేదా ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకుంటే జీర్ణక్రియ మరింత మెరుగ్గా జరుగుతుంది.

# 79 ఏళ్ల స్వాతంత్ర ఫలాలు అందరికీ దక్కుతున్నాయా!

గడగోజు రవీంద్రాచారి
9848772232





ఎందరో అమరవీరుల రక్తతర్పణంతో సాధించిన స్వాతంత్ర్యాన్ని ఏటా దేశవ్యాప్తంగా పండుగలా జరుపుకుంటున్నాం. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్నాం. జాతీయ గీతాన్ని ఆలపిస్తున్నాం. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటున్నాం. వారి పోరాట ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా మాట్లాడుతున్నాం. ప్రజాస్వామ్య వ్యవస్థలో మన పాలకులను మనమే ఎన్నుకుంటున్నాం. స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నాం. కానీ వారు కలలుగన్న స్వరాజ్యం అంటే కేవలం పాలకులు మారడమేనా? ప్రతి పేదవాడి జీవితంలో గౌరవం, భద్రత, సమానత్వం, అవకాశాలు కనిపించాల్సిన అవసరం లేదా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన సందర్భమే 79వ స్వాతంత్ర్య దినోత్సవం.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, అల్లూరి సీతారామరాజు, సుభాష్‌చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి మహనీయులతో పాటు చరిత్రలో పేరు నిలవని వేలాది మంది దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారు. గాంధీజీ నాయకత్వంలో లక్షలాది మంది ఉద్యమించారు. జైళ్లకు వెళ్లారు. లాఠీ దెబ్బలు తిన్నారు. కుటుంబాలను, ఆస్తులను, జీవితాలను దేశం కోసం అర్పించారు. వారి పోరాటం కేవలం విదేశీ పాలనను తరిమేయడం కోసం కాదు. భారతీయుడు తన నేలపై గౌరవంగా, స్వేచ్ఛగా, సమాన హక్కులతో జీవించాలన్నదే ఆ పోరాట స్ఫూర్తి. ఆకలి, అవమానం, అన్యాయం లేని సమాజం కోసం వారు కలలు కన్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన 79 ఏళ్లలో భారత్ ఎన్నో రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించింది. వ్యవసాయం, పరిశ్రమలు, విజ్ఞానం, సాంకేతికత, అంతరిక్షం, వైద్యం, సమాచార సాంకేతికత, మౌలిక సదుపాయాల్లో దేశం ముందడుగు వేసింది. ప్రపంచ వేదికపై భారత ప్రాధాన్యం పెరిగింది. ఇవన్నీ గర్వించాల్సిన విజయాలే. అయితే దేశం సాధించిన ప్రగతికి అనుగుణంగా ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయా? అన్నదే ప్రశ్న. దేశం ముందుకు సాగుతున్నా పేదవాడి బతుకు ఇంకా పోరాటంగానే ఉంటే, రైతు పంటకు గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తుంటే, చదువుకున్న యువత ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తుంటే, ఒక అనారోగ్యం కుటుంబాన్ని అప్పులపాలు చేస్తుంటే అభివృద్ధి ఫలాలు ఎవరి దాకా చేరుతున్నాయో ఆలోచించాల్సిందే. గణాంకాల్లో కనిపించే అభివృద్ధి సామాన్యుడి జీవితంలో కనిపించినప్పుడే అసలైన సార్థకత.

పాలకులు మారుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి. విధానాలు మారుతున్నాయి. ఎన్నికలు వస్తున్నాయి.. పోతున్నాయి. హామీలు మారుతున్నాయి. పథకాలకు పేర్లు మారుతున్నాయి. కానీ పేదవాడి సమస్యలు తరతరాలుగా కొనసాగుతుంటే మార్పు ఎక్కడ? పని కోసం ఎదురుచూసే యువత, పంటకు ధర కోసం ఎదురుచూసే రైతు, వైద్యం కోసం అప్పు చేసే కుటుంబం, పిల్లల చదువు కోసం తంటాలు పడే తల్లిదండ్రులు.. వీరి జీవితాల్లో మార్పు ఎంత? పాలకులు మారడం ప్రజాస్వామ్య ప్రక్రియ. కానీ ప్రజల బతుకులు మారడమే ప్రజాస్వామ్యానికి అసలు కొలమానం.

దేశ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తోంది. సంపద సృష్టి పెరుగుతోంది. పెట్టుబడులు వస్తున్నాయి. పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇవన్నీ అవసరమే. కానీ అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు చేరాలి. కొద్దిమంది వద్ద సంపద కేంద్రీకృతమవుతుండగా, మరోవైపు పేద కుటుంబాలు కనీస అవసరాల కోసం పోరాడుతున్నాయన్న ఆందోళన ఉంది. ఆదాయ, సంపద అసమానతలు పెరిగితే సామాజిక అంతరాలు మరింత తీవ్రమవుతాయి. నల్లధనం, పన్ను ఎగవేత, అక్రమ ఆస్తులపై చట్టం కఠినంగా పనిచేయాలి. అక్రమంగా కూడబెట్టిన సంపదను చట్ట ప్రకారం వెలికితీసి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలి. చట్టం ముందు అందరూ సమానమే అన్న నమ్మకం ప్రజల్లో బలపడాలి.

పెద్ద పెట్టుబడులు రావాలి. పరిశ్రమలు పెరగాలి. ఉపాధి అవకాశాలు విస్తరించాలి. ఆర్థిక వ్యవస్థ బలపడాలి. అయితే అభివృద్ధి అంటే పెట్టుబడులు, గణాంకాల పెరుగుదల మాత్రమే కాదు. ఆ అభివృద్ధి ఫలితంగా సామాన్య కుటుంబం మెరుగైన జీవితం గడపగలగాలి. సంక్షేమ పథకాలు అవసరమే. పేదవాడికి ప్రభుత్వం అండగా నిలవాలి. కానీ పేదవాడిని ఎప్పటికీ లబ్ధిదారుడిగా ఉంచడం కాదు.. స్వయం ఆధారితుడిగా నిలబెట్టడమే సంక్షేమానికి సార్థకత. ఉపాధి, నైపుణ్యం, విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పించి పేదరికం తరతరాలకు బదిలీ కాకుండా అడ్డుకోవాలి. పథకం ప్రకటించడం పాలనలో మొదటి అడుగు మాత్రమే. దాని ప్రయోజనం చివరి అర్హుడి గుమ్మానికి చేరడమే అసలు పరీక్ష.

దేశానికి అన్నం పెట్టే రైతు పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. వాతావరణ మార్పులు సవాళ్లు విసురుతున్నాయి. మార్కెట్ ధరల అనిశ్చితి రైతు ఆదాయాన్ని దెబ్బతీస్తోంది. న్యాయమైన ధర, సాగునీరు, రుణ సౌకర్యం, పంట బీమా, నిల్వ, రవాణా, మార్కెట్ సదుపాయాలు రైతుకు అందాలి. రైతు కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేలా సమగ్ర విధానాలు అవసరం. రైతు బతుకు నిలబడితేనే దేశ ఆహార భద్రత బలపడుతుంది.

కార్మికుడి శ్రమతో పరిశ్రమలు, నగరాలు, సేవారంగం నడుస్తున్నాయి. అయినా అనేకమందికి ఉపాధి భద్రత, తగిన వేతనం, సామాజిక రక్షణ అందడం లేదు. చదువుకున్న యువతకు తగిన ఉద్యోగం దొరకకపోవడం, నియామకాల జాప్యం, పోటీ పరీక్షల సమస్యలు, ప్రశ్నపత్రాల లీకేజీలు వారి భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయి. ఒక యువకుడి విలువైన వయసు ఉద్యోగం కోసం ఎదురుచూడటంలో గడిచిపోకూడదు. నైపుణ్యానికి తగిన ఉపాధి, పారదర్శక నియామక వ్యవస్థ, స్వయం ఉపాధికి ప్రోత్సాహం అందాలి.

మహిళల భద్రత, సమాన అవకాశాలు కూడా స్వాతంత్ర్యానికి కొలమానాలే. విద్య, ఉద్యోగం, రాజకీయాలు, విజ్ఞానం, క్రీడలు వంటి రంగాల్లో మహిళలు ముందుకు వస్తున్నా హింస, వేధింపులు, వివక్ష పూర్తిగా తొలగలేదు. చట్టాల సమర్థ అమలు, వేగవంతమైన న్యాయం, సామాజిక మార్పు అవసరం. ఒక మహిళ భయంలేకుండా జీవించగలిగినప్పుడే స్వేచ్ఛకు అసలైన అర్థం వస్తుంది.

విద్య, వైద్యం సామాన్యుడికి భారంగా మారకూడదు. ఒక పిల్లవాడి భవిష్యత్తు కుటుంబ ఆదాయాన్ని బట్టి నిర్ణయించకూడదు. ఒక అనారోగ్యం కుటుంబాన్ని అప్పులపాలు చేయకూడదు. నాణ్యమైన విద్య, అందుబాటు వైద్యం ప్రతి పౌరుడికి చేరాలి. ప్రభుత్వ విద్యా, వైద్య వ్యవస్థలను బలోపేతం చేయడం సమాన అవకాశాలకు పునాది.

ప్రజాస్వామ్యం ఐదేళ్లకోసారి ఓటు వేయడంతో ముగియదు. ప్రజలు ప్రశ్నించాలి. పాలకులు సమాధానం చెప్పాలి. ప్రజాధనం ఎలా ఖర్చవుతోందో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై జవాబుదారీతనం ఉండాలి. కులం, మతం, ప్రాంతం పేరుతో సమాజాన్ని విభజించకుండా ఐక్యతను కాపాడుకోవాలి. అభివృద్ధితోపాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

అందుకే 79వ స్వాతంత్ర్య దినోత్సవం కేవలం వేడుకగా ముగియకూడదు. దేశం సాధించిన విజయాలను గుర్తించడంతోపాటు ఇంకా మిగిలిన ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. పేదరికం ఎందుకు కొనసాగుతోంది? సంపద కొద్దిమంది వద్ద ఎందుకు కేంద్రీకృతమవుతోంది? రైతుకు స్థిరమైన ఆదాయం ఎందుకు లేదు? యువతకు తగిన ఉపాధి ఎందుకు దొరకడం లేదు? సంక్షేమ ఫలాలు ప్రతి అర్హుడి గుమ్మానికి చేరుతున్నాయా? ప్రజాప్రతినిధులు ఎంతవరకు జవాబుదారిగా ఉన్నారు? ఇవి ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టే ప్రశ్నలు కావు.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రశ్నలు.

అమరవీరులు మనకు స్వేచ్ఛను సాధించారు. రాజ్యాంగం మనకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలకు హామీ ఇచ్చింది. ఆ విలువలను పుస్తకాల పుటల్లో కాకుండా ప్రజల జీవితాల్లో సజీవం చేయడం నేటి పాలనా వ్యవస్థ బాధ్యత.

పాలకులు మారితే సరిపోదు.. పాలన మారాలి. పథకాలు ప్రకటిస్తే సరిపోదు.. ఫలాలు పేదవాడికి చేరాలి. దేశ సంపద పెరిగితే సరిపోదు.. ప్రజల ఆదాయం పెరగాలి. దేశం ఎదిగితే సరిపోదు..

ప్రతి పేదవాడి ఇంట్లో ఆకలి తగ్గి, ప్రతి రైతు జీవితంలో భరోసా పెరిగి, ప్రతి యువకుడికి గౌరవప్రదమైన ఉపాధి లభించి, ప్రతి మహిళ భద్రంగా జీవించి, ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికి అందుబాటు వైద్యం లభించినప్పుడే స్వాతంత్ర్య ఫలాలు నిజంగా ప్రజలకు చేరినట్లు.

జెండా ఏటా ఎగురుతుంది. జాతీయ గీతం ఏటా మార్మోగుతుంది. స్వాతంత్ర్య వేడుకలు ఏటా జరుగుతాయి. స్వాతంత్ర్యం సార్థకత మాత్రం ప్రజల బతుకుల్లో కనిపించాలి. అదే అమరవీరుల త్యాగాలకు నివాళి.

# బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ మంచిదేనా?

చాలామంది తమ చేతిలో అదనపు డబ్బు ఉండగానే బ్యాంకులో డిపాజిట్ చేయాలని అనుకుంటారు. అయితే బ్యాంకులో డిపాజిట్ వల్ల తక్కువ వడ్డీ రావడంతో పాటు లాంగ్ పీరియడ్ లో ఎలాంటి లాభం ఉండదు. ఇతర పెట్టుబడులు అంత సురక్షితం కావు. మరి ఇలాంటి సమయంలో చేతిలో ఉన్న డబ్బుతో ఏం చేయా లి? ఇక్కడ ఇన్వెస్ట్‌మెంట్ చేయాలి? అనే దానిపై కొందరు నిపుణులు ఏం చెబుతున్నారంటే.?

సాధారణంగా ఒక వంద రూపాయలను బ్యాంకులో డిపాజిట్ చేస్తే ఏడాదికి రూ.103 అవుతుంది. అదే ఫిక్స్డ్ డిపాజిట్ చేస్తే రూ. 107 అవుతుంది. కానీ ఏడాది సమయం అయ్యేవరకు మిగతా వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. బ్యాంకులో వచ్చే ఈ లాభం కంటే వస్తువుల ధరలు పెరగడంతో నష్టమే జరుగుతుంది. ఇలాంటప్పుడు ఫిక్స్డ్ డిపాజిట్ తో లాంగ్ పీరియడ్‌లో పెద్ద లాభం ఉండదు.

కానీ ఇతర పెట్టుబడులకంటే బ్యాంకు డిపాజిట్లు ఎంతో శ్రేయస్కరం. బ్యాంకులో డిపాజిట్ చేస్తే ప్రత్యేకంగా బాండ్ ఇస్తారు. అంతేకాకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు డబ్బు తీసుకోవచ్చు. ఎన్ని సంవత్సరాలైనా బ్యాంకులు మోసం చేసే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఇలాంటప్పుడు చేతిలో డబ్బుతో ఏం చేయాలి?

అందరి జీవితాలు ఒకేలా ఉండవు. అందువల్ల అందరి పరిస్థితులు ఒకేలా ఉండవు. ఇలాంటప్పుడు తమ పరిస్థితులకు అనుగుణంగా డబ్బును సరైన మార్గంలో ఇన్వెస్ట్మెంట్ చేయాలి. ఉదాహరణకు ఒక వ్యక్తి దగ్గర రూ 500000 నిల్వకు ఉంటే దానిని కనీసం ఐదు నుంచి పది సంవత్సరాల పాటు ఫిక్స్డ్ డిపాజిట్ చేయాలనుకుంటే మ్యూచువల్ ఫండ్ వంటి వాటిలో పెట్టుబడులు పెట్టవచ్చు. ఎందుకంటే ఇందులో లాంగ్ పీరియడ్లో ఎక్కువగా లాభాలు వచ్చే అవకాశాలు ఉంటాయి. అంటే కాకుండా ఈ మొత్తాన్ని ఒకే చోట కాకుండా వివిధ రకాలుగా పెట్టుబడి పెట్టాలి. ఉదాహరణకు కొంత మ్యూచువల్ ఫండ్లో.. మరికొంత పబ్లిక్ ఫండ్లో.. ఇంకొంత బ్యాంకు డిపాజిట్ చేసుకోవాలి.




ఇలా పెట్టు పనులను విభజించడం వల్ల అత్యవసరానికి బ్యాంకు డిపాజిట్ తీసుకోవచ్చు. లాంగ్ మ్యూచువల్ ఫండ్ వంటి ఇతర వాటిలో పెట్టుబడులు పెట్టిన దానిని లాంగ్ పీరియడ్లో ఉపయోగించుకోవచ్చు. అందువల్ల చేతిలో డబ్బు నిల్వ ఉన్నవారు ఒకే విషయంపై ఆలోచించకుండా పెట్టుబడులపై అవగాహన పెంచుకోవాలి. రకరకాల మార్గాల ద్వారా పెట్టుబడులు పెడితేనే అత్యధికంగా లాభాలు పొందడంతో పాటు డబ్బులు సేఫ్ గా ఉంచుకోగలుగుతారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 11.08.2026
www.mudranews.in | @mudranews



**కడుపు ఉబ్బరం:**

ఉప్పు ఎక్కువగా తీసుకోవద్దు ఆహారంలో ఉప్పు అధికంగా ఉండటం వల్ల శరీరంలో నీరు నిల్వ అయ్యే అవకాశం ఉంది. దీంతో పొట్ట ఉబ్బినట్లు అనిపించవచ్చు. ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్స్‌ను తగ్గించి, ఉప్పును పరిమితంగా తీసుకోవడం మంచిది.

# అమ్మవారి ఆశీర్వాదంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి





**తాండూర్ శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** కాళికాదేవి మాత ఆశీర్వాదంతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, పచ్చని పంట పొలాలతో సుభిక్షంగా జీవించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అమ్మవారితో వేడుకున్నారు. సోమవారం రోజునతాండూర్ పట్టణంలో "శ్రీ కాళికా దేవి బోనాల జాతర" సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, అమ్మవారి పల్లకి సేవలో పాల్గొన్నారు. ఆడపడుచులు జరుపుకునే పండుగలు చాలా ముఖ్యమైన పండుగ బోనాల పండుగని ఆషాడ మాసం ప్రారంభం నుండి పండుగను ఎంతో ఘనంగా నిర్వహించుకుంటారని, ఆయన పేర్కొన్నారు. బోనాల జాతర ఉత్సవంలో మునిసిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆలయ కమిటీ అధ్యక్షులు, పాలకవర్గం, తాండూర్ పట్టణ అధ్యక్షులు , యువకులు, పట్టణ ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.

## మీరు చేస్తున్న పూజలకు చాలా సంతోషంగా ఉంది



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** మీరు చేస్తున్న పూజలకు తాను చాలా సంతోషపడుతున్నానని రంగం భవిష్యవాణిలో జోగిని అనురాధ అన్నారు. బోనాల ఉత్సవాలలో భాగంగా లంగర్ హౌస్ బుజిలీ మహంకాళి ఆలయంలో సోమవారం రోజున చైర్మన్ భోగి బాలరాజ్ ఆధ్వర్యంలో గావు, రంగం భవిష్యవాణి కార్యక్రమం నిర్వహించారు. పచ్చి కుండ ఎక్కిన అనంతరం జోగిని అనురాధ భవిష్య అని వినిపించారు. పూజలు ఎన్ని చేసినా తల్లిదండ్రులను గౌరవిస్తూ, వారి ఆశీర్వాదాలతో కార్యక్రమాలు ప్రారంభిస్తేనే విజయం లభిస్తుందని తెలిపారు. తాను కోరినట్టుగా కట్టమైసమ్మ ఆలయాన్ని నిర్మించారు, బొడ్రాయిగూడ స్థాపించారని దానికి సంతోషంగా ఉన్నానన్నారు. భక్తిశ్రద్ధలతో నా కోసం చేస్తున్న పూజలు తనను మెప్పించాయని చెప్పారు. అయితే ప్రతి శుక్రవారం అన్ని అమ్మవార్ల దేవాలయాల్లో కుంకుమార్చన, కళ్ళు సాకా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. క్రమం తప్పకుండా ఈ పూజలు నిర్వహిస్తేనే వర్షాలు కురుస్తాయి అన్నారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేకంగా తరలివచ్చి భవిష్యవాణ్ని విన్నారు.

## దాతల చేయూత అభినందనీయం

**చేవెళ్ల పురపాలిక చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి**



**ముద్ర, చేవెళ్ల:** ప్రభుత్వ పాఠశాల ల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని చేవెళ్ల పురపాలిక చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అన్నారు. చేవెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెంకట్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని దాతలు గుడుపల్లి శ్రీకాంత్ రెడ్డి, టేకులపల్లి శ్రీనివాస్ చేవెళ్ళ కస్తూరిభ పాఠశాల లో గోడ నిర్మాణం, గోడలకు రంగులు, ఫ్యాన్స్ అందచేశారు.కేక్ కోఇంచి విద్యార్థుల కు చాకలేట్ లు అందచేశారు. ఈ సందర్భంగా ఆమె దాతలను అభినందించారు. అనంతరం పట్టణంలో ఆయన జన్మ దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ప్రజాప్రతినిధులు,నాయకులు, సన్నిహితులు పూలమాలలు, శాలువా లతో సన్మానించారు. భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షంచారు.కార్యక్రమం లో మాజీ సర్పంచ్ శైలజ ఆగి రెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, వీరేందర్ రెడ్డి, ఆగిరెడ్డి, అజస్, శ్రీనివాస్, మల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మాదిగ లాయర్స్ ఫెడరేషన్ కమిటీ



సమక్షంలో ఆదివారం రాత్రి ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా గాదెపాక శంకర్, అధికార ప్రతినిధిగా ఎరసాని జంగయ్య,జనరల్ సెక్రటరీగా గ్యార పోశెట్టి, సుక్క శ్రవణ్ కుమార్, బొందుగుల నవిత, జాయింట్ సెక్రటరీగా కొన్నే వెంకటేష్, నాగారం సూరజ్, ఉపాధ్యక్షులుగా నకిరేకంటి మొగులయ్య, ఎర్ర రేణుక, చింతల రాజు, చిద్రకంటి ముందుకు నడుస్తూ జాతి ప్రయోజనాల కోసం పాటుపడతానని న్యాయవాదుల సంక్షేమం కొరకై, జూనియర్ న్యాయవాదుల అభివృద్ధి కొరకు న్యాయవాదుల సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని తన ఎన్నికకు సహకరించిన న్యాయవాదులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## పట్నం రుక్కమ్మకు నివాళులు



**ముద్ర శంకర్ పల్లి :** ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి రుక్కమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య నగరంలోని మహేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి రుక్కమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. చేవెళ్ల శాసనసభ్యులు యాదయ్య తో పాటు శంకర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి, గోపులారం మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం జిల్లా కమిటీ



**ముద్ర, దేవరకొండ:** ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం నల్లగొండ జిల్లా నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగుల జ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా గ్యార యాదగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ, విద్యారంగ అభివృద్ధి కోసం కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులు నిర్ణయించారు. నల్గొండ జిల్లా నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడుగా గ్యార యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఒంటెపాక సుష్మ, అధికార ప్రతినిధిగా అద్దంకి కిరణ్, ఉపాధ్యక్షులుగా శంకర్, తొంట సుధా, పొలిమేర దశరథ, సహాయ కార్యదర్శులుగా రామావత్ బాలు నాయక్, నల్లబెల్లి డేవిడ్ రాజ్, ఇంద్ర కుమార్,ప్రచార కార్యదర్శులుగా కొమ్ము సుదర్శన్, మేడి స్వామి, కోశాధికారిగా సైదాచారి, కమిటీ సభ్యులుగా విద్య శ్రీ, గుండె రామలింగం, నామ సైదులు, కొమ్ము యాదగిరి, ముదిగొండ యాదయ్య, శ్రీలత, అందుగుల నాగరాజులను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఫౌండర్ మచ్చ నరసయ్య, రాష్ట్ర అధ్యక్షులు ఈదుల రామాంజనేయులు, అధికార ప్రతినిధి మాతంగి రాములు, కోశాధికారి ఆకులపల్లి శ్రీను, సహాయ కార్యదర్శి స్వామి, రాష్ట్ర నాయకులు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సంఘం తరపున నిరంతరం కృషి చేస్తామని, అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు.

## కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



**ముద్ర ప్రతినిధి, తాండూర్.** వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గం యాలాల్ మండలం కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్‌పర్సన్ కంజర్ల విజయలక్ష్మి యాదవ్ విజయక్క శ్రీమంత కానుక కార్యక్రమంలో పాల్గొని గర్భిణీ మహిళలకు గడప గడప కి వెళ్లి శ్రీమంత కార్యక్రమం నిర్వహించారు, తదుపరి బాలింతలకు జనని కిట్స్ అందజేశారు.అనంతరం యాలాల్ నుంచి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బ్యాగులను వాడటం మానేసి, పునర్వినియోగ బ్యాగులను ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ తరఫున తయారు చేయించిన బ్యాగులను యాలాల్ ప్రజలకు అందజేశారు.

## కొర్ర చందు నాయక్ ముందస్తు అరెస్టు




**ముద్ర, దేవరకొండ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాగార్జునసాగర్ పర్యటన నేపథ్యంలో దేవరకొండ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు చందునాయక్ ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. తనను అక్రమంగా అరెస్టు చేశారని చందు నాయక్ తన అరెస్టును నిరసిస్తూ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం తమ విఫల పాలనను ప్రజల సమస్యలను కప్పిపుచ్చుకోవడానికే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రాష్ట్రంలో సక్రమంగా అమలు కాకపోవడంతో వేలాది మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పూర్తి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే పైళ్ల జన్మదిన వేడుకలు

**రక్తదాన శిబిరాలు... అన్నదానాలు...**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, సుజలదాత, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి జన్మదినం సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా బిఆర్ఎస్ నాయకులు అభిమానులు ఘనంగా నిర్వహించారు. భువనగిరి లోని కుమ్మరివాడలోని శ్రీ గణపతి ఆలయంలో పూజలు చేసి కార్యక్రమం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. 33 వ వార్డు విద్యానగర్ లోని శ్రీ వాణి విద్యాలయంలో ఉచిత దంత వైద్య శిబిరం, ప్రిన్స్ చౌరస్తా వద్ద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో శేఖర్ ఈ ప్రాంతానికి సేవ చేసే భాగ్యం మళ్లీ కలగాలని నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఆనందలతో వారి కుటుంబ సభ్యులు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కొలుపుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు,



బిఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు చేన్న స్వాతి మహేష్, నాకోటి నగేష్, చీమల రాజు , ఏలే శివకుమార్, నాయకులు సురపల్లి రమేష్, మధుసూదన్ రెడ్డి, జెక్క రాఘవేందర్ రెడ్డి, రాకల శ్రీనివాస్, మిరియాల శ్రీనివాస్,తాడూరు బిక్షపతి, తాడం రాజశేఖర్, శివకుమార్, నితీష్, సూరజ్, ఇండ్ల శ్రీనివాస్, రొయ్యల పవన్, సైదులు, విక్రమ్ పాలొన్నారు.వడాయి గూడెం గ్రామంలో మండలంలోని వడాయి గూడెం గ్రామంలో భువనగిరి మాజీ శాసన సభ్యులు శ్రీ పైళ్ల శేఖర్ రెడ్డి 56వ జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ నీల శిరీష ఓం ప్రకాష్ గౌడ్ నేతృత్వంలో బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల అభిమానుల మధ్య కేక్ కటింగ్ చేసి మొక్కలు నాటి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, ప్రధాన కార్యదర్శి నీల ఓం ప్రకాష్ గౌడ్, మండల సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు జక్కా రాఘవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు అతికం లక్ష్మీనారాయణ గౌడ్, కేశపట్నం రమేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బల్గురి మధుసూదన్ రెడ్డి, మండల నాయకులు గుండు ముత్తయ్య గౌడ్, అబ్బగాని వెంకట్ గౌడ్, ర్యాకల శ్రీనివాస్, కస్తూరి పాండు, సర్పంచులు కటికే జంగయ్య యాదవ్, పడాల వెంకటేశ్వర్లు, కొండూరి ధనమ్మ, సత్యనారాయణ గౌడ్, నాగేల్లి గిరిజ రమేష్ గౌడ్, అంకర్ల మురళీకృష్ణ, కడమంచి ప్రభాకర్, మట్ట ధనుంజయ గౌడ్, ఈర్ల కృష్ణ, చుక్కల శంకర్ యాదవ్, పబ్బాల ఉప్పలయ్య, ముల్లే నాగేంద్రబాబు, జక్కుల చంద్రయ్య, జమ్ముల రమేష్, మట్ట బాలకృష్ణ, శెట్టి అశోక్, ఓరుగంటి రమేష్, పోల ప్రవీణ్ గౌడ్, పిన్నింటి మధు రెడ్డి, గాదే శ్రీకాంత్, గొడ్డేటి యాదగిరి, శెట్టి శ్రీకాంత్, గొడ్డేటి తిరుపతి, నీల భరత్ గౌడ్, కోల సందీప్, కోట చంద్రశేఖర్, బండారి స్వామి, ములుగు నాగరాజు, బండారు స్వామి పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



**ముద్ర, చేవెళ్ల :** షాబాద్ మండల పరిధి లోని తిరుమలాపూర్, రేగాడి దోస్వాడ, దామర్లపల్లి తదితర గ్రామాల్లో సోమవారం పోచమ్మ, మైసమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.అమ్మా చల్లంగా చూడాలి అని, వర్షాలు సంవృద్ధిగా కురవాలని వేడుకున్నారు. నైవేద్యం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.కార్యక్రమం లో తిరుమలాపూర్ సర్పంచ్ మంగమ్మ ఉపసర్పంచ్ మహేందర్, మాజీ సర్పంచులు విజయ, లక్ష్మయ్య, గోపాల్ రెడ్డి,వార్డుసభ్యులు,నాయకులు శ్రీరామ్ రెడ్డి, అంజయ్య, శ్రీశైలం, అశోక్, రాములమ్మ, దేవేందర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, బంధయ్య, మల్లేష్, దయాకరచారి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## కడుపు ఉబ్బరం: మలబద్ధకాన్ని నిర్లక్ష్యం చేయవద్దు

మలబద్ధకం ఉన్నప్పుడు కడుపులో గ్యాస్, ఉబ్బరం పెరగవచ్చు. తగినంత నీరు తాగడం, క్రమం తప్పకుండా కదలడం, పండ్లు-కూరగాయలు వంటి ఫైబర్ ఉన్న ఆహారాన్ని తీసుకోవడం సహాయపడుతుంది. అయితే ఫైబర్‌ను ఒక్కసారిగా ఎక్కువగా పెంచకుండా క్రమంగా పెంచాలి.



## కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా హర్ ఘర్ తిరంగా

**స్వగృహంపై జాతీయ జెండా ఎగరవేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం**

ముద్ర, కరీంనగర్ : కరీంనగర్ జిల్లావ్యాప్తంగా సోమవారం రోజున 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రోగ్రాం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తన స్వగృహంపై కుటుంబ సభ్యుల తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూమన జాతీయ పతాకం దేశానికి , మనందరికీ గర్వకారణమని, దేశభక్తిని కలిగే విధంగా నిరంతర ప్రేరణ శక్తిని ఇస్తుందని తెలిపారు. 2022 నుండి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆగస్టు 15

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి, 'వికసిత భారత్' నిర్మాణానికి మద్దతుగా నిలిచి, మనందరి ఐక్యతను చాటి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన ఆర్టీసీ డ్రైవర్‌కు రూ.50 లక్షల చెక్కు

**ముద్ర, కోరుట్ల;** రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎం.డి. మాదర్ కు ఆర్టీసీ యాజమాన్యం అండగా నిలిచింది. యూబీఐ పథకం కింద ప్రమాద బీమా పరిహారంగా రూ.50 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి , యూబిఐ బ్యాంక్ సీజీఎం ఎం రవీంద్రబాబు, డీజిఎం ఎన్. సత్యనారాయణ, బాబ్జి, ఏజీఎం. రంజన్ కుమార్ మిశ్రా ఆధ్వర్యంలో బాధిత డ్రైవర్ ఎం.డి. మాదర్ కు రూ.50 లక్షల చెక్కును సోమవారం రోజు అందజేశారు. ఉద్యోగుల సంక్షేమానికి ఆర్టీసీ యాజమాన్యం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని వారు తెలిపారు. ప్రమాదంలో కాలు కోల్పోయిన తనకు యూబీఐ పథకం ద్వారా సహాయం అందించిన ఆర్టీసీ యాజమాన్యానికి డ్రైవర్ ఎం.డి. మాదర్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పి. సోలోమన్, సిహెచ్ వెంకన్న, ఎం. రాజశేఖర్, కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి. రాజు మరియు కోరుట్ల డిపో మేనేజర్ ఎన్. మనోహర్ పాల్గొన్నారు.

## బీరుసీసాలతో యువకుడిపై ఆరుగురి దాడి



**ముద్ర, కరీంనగర్ :** సోదరుడితో ఉన్న యువకుడిపై ఆరుగురు దాడి చేయడంతో పాటు బీరు సీసాతో పొడవడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కరీంనగర్ కిసాన్‌నగర్‌కు చెందిన గుగులోతు శ్రీకాంత్ (28), అతడి సోదరుడు శేఖర్‌లు ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో స్థానిక ఓపెన్ జిమ్ ప్రాంతంలో ఉన్నారు. స్థానిక కార్పొరేటర్ అనుచరులైన భానుచందర్, మధు, చింటూ, నాగేందర్, రాజు, మరొకరు బీరు తాగుతూ వచ్చి కత్తులతో శ్రీకాంత్, అతడి సోదరుడిపై దాడి చేసేందుకు ప్రయత్నించగా తప్పించుకోవడానికి ప్రయత్నించారు. వీరిని చుట్టుముట్టిన వారు బీరు సీసాతో శ్రీకాంత్ పొట్ట భాగంలో పొడవడంతో తీవ్రంగా గాయమైంది. దీంతో వెంటనే వారు పరారయ్యారు. శ్రీకాంత్‌ను అతని సోదరుడు శేఖర్, స్నేహితులు, స్థానికుల సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, రెండో ఠాణా సీఐ సృజన్‌రెడ్డిలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బాధితుడితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక కార్పొరేటర్‌తో శ్రీకాంత్‌కు పాతకక్షలు ఉన్నాయని దీంతో అతడి అనుచరులతో దాడి చేయించారని శ్రీకాంత్ భార్య పూజశ్రీ, సోదరుడు శేఖర్‌లు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మీడియాకు తెలిపారు. నిందితులను గుర్తించామని, వారిని అదుపులోకి తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించినట్లు టౌన్ ఏసీపీ వెంకటస్వామి వివరించారు.

## నిర్మల్ లో "జైల్ భరో" విజయవంతం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో నిర్మల్ లో ఆదివారం జైల్ భరో నిర్వహించారు. ఇందులో భాగంగా అంబేద్కర్ విగ్రహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూల, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తున్నదన్నారు.నాడు బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. లేబర్ కోడ్ల అమలుకు ఫైనల్ రూల్సు నోటిఫై చేసి విద్యుత్ సవరణ బిల్లు-2025, విత్తన చట్టానికి సవరణలు ప్రతిపాదించారన్నారు. సులభతర వ్యాపారం పేరుతో పెట్టుబడిదారుల గరిష్ట లాభాల కోసం కార్మిక చట్టాలను రద్దు చేసి పని గంటలను 8 నుండి 12 గంటలకు పెంచుకునేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చారన్నారు. ఉద్యోగ భద్రత పాతర వేసి 300 మంది లోపు పనిచేసే కంపెనీలో కార్మికులను




ఎప్పుడైనా నోటీసు లేకుండా తొలగించేందుకు "హైర్ & ఫైర్" విధానాన్ని తెచ్చారన్నారు. వివిధ శాఖల్లో ఉద్యోగ భద్రత, కనీస వేతనానికి నోచుకునే స్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టి సి యూ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే రాజన్న, సి ఐ టి యూ జిల్లా కార్యదర్శి, బొమ్మెన.సురేష్, జిల్లా అధ్యక్షులు పి.గంగమణి, ఉపాధ్యక్షులు కిషన్, సుజాత, జిల్లా సహాయ కార్యదర్శులు శైలజ, రాధ, జిల్లా కమిటీ సభ్యులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## కరీంనగర్.. మాఫియాకి అడ్డాగా మారింది

**జనసేన ఆత్మీయ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర నేతలు**
**సికిల్‌సెల్ అనీమియా బాబు చికిత్సకు హామీ**



**ముద్ర, కరీంనగర్ :** వచ్చే శాసనసభ ఎన్నికల్లో జనసేన తెలంగాణలో పోటీ చేస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తల్లూరి తెలిపారు. ఆదివారం పార్టీ నాయకులు బండారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడానికి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 5 పార్లమెంట్ స్థాయి సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఏ విధంగా ముందుకెళ్లాలని అందరితో మాట్లాడుతున్నామని, తెలంగాణలో జనసేన క్రియాశీలకంగా మారుతుందన్నారు. పార్లమెంట్ కమిటీలు, రాష్ట్ర కమిటీలు వేయడానికి సలహాలు, సూచనల కోసం సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని, పొత్తు గురించి అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఇతర పార్టీలతోనైనా ఒంటరిగానైనా పోటీ చేయడానికి సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్‌పై దృష్టిసారించామని ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామన్నారు. ప్రచార కార్యదర్శి ఆర్‌కే సాగర్ మాట్లాడుతూ తెలంగాణ రాజకీయాలను శాసించే మంత్రులు, వివిధ పార్టీల కేంద్ర మంత్రులుండగా ఒకప్పటి ఉద్యమాల గడ్డ మాఫియా అడ్డాగా మారిందని ఆరోపించారు. బొగ్గు, ఇసుక, గ్రానైట్, బూడిద మాఫియా, శాంతిభద్రతల లోపం, బ్యాంకు దోపిడీ, నేరెళ్ల ఘటనలే ఇందుకు నిదర్శనమన్నారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌కి చెందిన 5 ఏళ్ల బాలుడు ఆయూష్ సికిల్‌సెల్ అనీమియాతో బాధపడుతున్నారని పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి చికిత్స అందించాలని కోరగా ఆర్‌కే సాగర్ స్పందించి ఆయన దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చికిత్స అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశానికి ముందు బొమ్మకల్‌లో పార్లమెంట్ కార్యాలయాన్ని రాష్ట్ర నేతలు ప్రారంభించారు. అక్కడి నుంచి ద్విచక్రవాహనాల ర్యాలీతో అమరవీరుల స్తూపంకు నివాళులర్పించిన అనంతరం సమావేశానికి వచ్చారు. ఆర్‌కే సాగర్ ద్విచక్ర వాహనం నడుపుకుంటూ రావడం పార్టీ నాయకుల్లో ఆనందం నింపింది. పార్టీ నాయకులు రాజ్‌కుమార్, డాక్టర్ కృష్ణప్రియ, కందుల రాజిరెడ్డి, కాస రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలం



**ముద్ర, కోరుట్ల;** వృద్ధులు మరియు బీడీ కార్మికులకు పెన్షన్ వెంటనే మంజూరు చేయాలంటూ భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ శాఖ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బీడీ కార్మికులతో బస్టాండ్ వద్ద జాతీయ రహదారి పై బైఠాయించి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వై. అనూప్ రావు కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రతి ఒక్కరికి అర్హులైన వారందరికీ పెన్షన్ మంజూరు చేస్తామని హామీనిచ్చి నెరవేర్చకపోగా వాటిని నీరుగారుస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే వర్గానికి కొమ్ము కాయడం సమంజసం కాదని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కౌన్సిలర్లు ఇందూరి తిరుమల వాసు, గూగులవత్ శ్రీకాంత్, కలాల రాధా సాయిచంద్, బిజెపి జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు గుగ్గిళ్ళ తుప్పరాం గౌడ్, మోర్చా జిల్లా అధ్యక్షులు బద్దం తిరుపతిరెడ్డి, ఎండోమెంట్ కన్వీనర్ మాడవేణి నరేష్ , జిల్లా కార్యవర్గ సభ్యులు గిన్నెల శ్రీకాంత్, తులసి కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఎర్ర రాజేందర్ చెట్లపెల్లి సాగర్, మ్యకల గణేష్, గందె నవీన్, మండల అధ్యక్షులు పంచరి విజయ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొడుకును హత్య చేయబోయిన తండ్రి రిమాండ్

**ముద్ర, కరీంనగర్ :** రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేటలో శనివారం కొడుకును హత్య చేసేందుకు ప్రయత్నించిన తండ్రిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు చందుర్తి సీఐ రవీందర్ తెలిపారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మల్కపేటలో గుడిపేట రాఘవులు తన కొడుకు రాజేందర్‌పై గొడ్డలితో దాడి చేసి హత్యకు ప్రయత్నించాడు. రాజేందర్ ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిందితుడు రాఘవులును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

## రోజుల తరబడి నీటిలోనే.. 16 ఏళ్ల బాలుడి వింత ప్రవర్తన

**ముద్ర డెస్క్ :** పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా బెల్దాంగాకు చెందిన 16 ఏళ్ల ఇక్బాల్ షేక్ గత ఐదేళ్లుగా ఇలా చెరువుల్లోనే గడుపుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. శరీరంలో మంటగా అనిపించడం వల్లే నీటిలో ఉంటున్నానని ఇక్బాల్ చెబుతున్నాడు. బయటకు రాగానే మంట మొదలవుతుందని.. నీటిలోకి వెళ్లగానే ఉపశమనం కలుగుతుందని అంటున్నాడు. రోజుల తరబడి నీటిలో ఉండటంతో అతడు చర్మవ్యాధుల బారిన పడుతున్నాడు. ఇక, జలుబు, దగ్గు వెంటాడుతున్నాయి. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకున్నా.. ఫలితం లేకపోయింది. ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లే స్తోమత తమకు లేదని ఇక్బాల్ కుటుంబసభ్యులు చెబుతున్నారు. దీంతో అతడికి చికిత్స చేయించేందుకు స్థానికులు ముందుకొస్తున్నారు.



## వరద విలయం... కొట్టుకుపోయిన బ్రిడ్జి..

**ముద్ర, ఢిల్లీ :** భారీ వర్షాల కారణంగా ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో ఓ వంతెన కొట్టుకుపోయింది. పై నుంచి వస్తున్న వరద ప్రవాహం కారణంగా నీతి వ్యాలీ ప్రాంతంలోని స్టీల్ బ్రిడ్జి అమాంతం కొట్టుకోవడాన్ని స్థానికులు వీడియో తీశారు. ఆదివారం రాత్రి నుంచి ఈ ప్రాంతంలో వర్షం కురుస్తూనే ఉంది. దీంతో సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు



## కరీంనగర్‌లో ముగిసిన ఎస్ఐఆర్ సర్వే

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) సర్వే సోమవారం సాయంత్రంతో ముగియనుంది. జూన్ 24న ప్రారంభమైన ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును ఎన్నికల సంఘం ఆగస్టు 10 వరకు పొడిగించింది. ఓటర్ల నుంచి సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి తీసుకుని డిజిటలైజేషన్ చేసే పనిలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, మానిటరింగ్ అధికారులు నిమగ్నమయ్యారు.

నియోజకవర్గంలోని గ్రామాలు, నగర ప్రాంతాల్లో చివరి దశ డిజిటలైజేషన్ ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. దీంతో నియోజకవర్గంలో తుది లెక్కన ఎంతమంది ఓటర్లు ఉన్నారనే విషయం స్పష్టమవుతుంది.

**1.02 లక్షల మంది ఓటర్లపై అనిశ్చితి**

డిజిటలైజేషన్ లెక్కల ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లలో 1,02,518 మంది పేర్లు తొలగించినట్లుగా అధికారిక లెక్కలు సూచిస్తున్నాయి. మరో 25,148 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. మ్యాపింగ్ పూర్తికాకపోవడం, 2002 ఓటరు జాబితాతో వివరాలు సరిపోలకపోవడం, ప్రస్తుత జాబితాలో పేర్లు లేదా వివరాల్లో తప్పులు ఉండటం వంటి కారణాలతో ఈ నోటీసులు జారీ చేస్తున్నట్లు సమాచారం.

నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పేర్లు, వివరాలను సరిచేసుకునేందుకు ఎన్నికల సంఘం సూచించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. మూడు రోజుల ఎడిట్ అవకాశం సోమవారంతో ముగియనుండగా, అవసరమైన ఆధారాలను సమర్పించేందుకు నెల రోజుల సమయం కల్పించారు.ముసాయిదా జాబితాలో పేరు లేకపోతే సంబంధిత వ్యక్తులు ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ఎన్నికల సంఘం సూచించిన పత్రాలను జత చేయాల్సి ఉంటుంది. దీంతో ముసాయిదా జాబితా విడుదల అనంతరం ఓటర్ల నుంచి అభ్యంతరాలు, కొత్త దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 11.08.2026
www.mudranews.in | @mudranews



**కడుపు ఉబ్బరం:**



భోజనం తర్వాత కొద్దిసేపు నడవండిభోజనం చేసిన వెంటనే పడుకోకుండా 10–15 నిమిషాలు తేలికగా నడవడం అలవాటు చేసుకోవాలి. శారీరక కదలిక జీర్ణక్రియకు తోడ్పడుతుంది. కడుపులో పేరుకున్న గ్యాస్ బయటకు వెళ్లేందుకు కూడా ఇది సహాయపడవచ్చు.

# అరుణోదయమై మెరిసి... ప్రజా గొంతుకై మోగెన్

### 50 గంటల ఆట, పాటల 'కళా జాతర'




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** అరుణోదయ విమలక్క 50 ఏళ్ల ప్రజా సంస్కృతిక ప్రస్థానాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 26న ఉదయం పదిగంటల నుంచి సెప్టెంబర్ 28 మధ్యాహ్నం 12: గంటల వరకు ఏకధాటిగా 50గంటల పాటు ఆట.. పాట.. మాటలతో ప్రజా కళా జాతర కార్యక్రమం హైదరాబాదులో నిర్వహిస్తున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క వెల్లడించారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. విప్లవోద్యమాల నుండే విప్లవకారులు పుడతారని, ప్రజా ఉద్యమాల నుండి ప్రజా కళాకారులు ఉద్భవిస్తారని, తన జీవితకాలం విప్లవ ప్రజా సంస్కృతిక ఉద్యమాలలో 50 ఏళ్ల మైలురాయిని అధిగమించిన తన ప్రస్థానంలో 50 గంటల పాటు ఏకధాటిగా ఆట,పాట, మాటలతో ప్రజాకళ జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహుళ ప్రజా కళలు, జానపద కళారూపాలు , ప్రజా కళా జాతర, మనువాదంగా సంస్కృతి మూఢత్వమై, సామ్రాజ్యవాద సంస్కృతి సాగుతున్న దాడికి ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి నిర్మాణంలో భాగమై సంస్థలను, శక్తులను, వ్యక్తులందరినీ సాదరంగా ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. విమలక్క ఒక వ్యక్తి కాదు అని, సామూహిక శక్తి అని 1974 ఆగస్టులో అరుణోదయ సంస్కృతిక సమైక్య ఉస్మానియాలో పురుడు పోసుకునేటప్పటికీ బాల గాయనిగా వెలుగులోకి వచ్చిన విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని అన్నారు. అనేక కష్ట నష్టాలను ఎదుర్కొని జైలు జీవితాన్ని అనుభవించి ప్రజా ఉద్యమాలే ఆయుధంగా ఎంచుకొని అరుణోదయ సంస్కృతిక విప్లవంలో పాటల ప్రస్తానం ఒక మరుపురాని ఘట్టం అన్నారు. తన జీవితం ప్రజలకు అంకితంగా భావిస్తూ తన స్వభావం కలిగిన కార్యకర్తలను కళాకారులను ప్రేమ పూర్వకంగా 50 గంటల పాటు సాగే ప్రజా కల జాతర నిర్వహణలో స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విమలక్క పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో అరుణోదయ సంస్కృతిక సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్, ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, వర్ష సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, టిపి జెఎసి జిల్లా కన్వీనర్ విజయ్, అరుణోదయ సంస్కృతిక సమైక్య సహకార దర్శి రాకేష్, ఉపాధ్యక్షులు అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో హోరెత్తిన అఖిలపక్ష పోరు

### నయా ఉదారవాద విధానాలపై రైతులు, కార్మికుల ఆగ్రహం







**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఖమ్మంలో అఖిలపక్ష ఆధ్వర్యంలో 'జైల్ భరో' కార్యక్రమం ఉద్విగ్నభరితంగా సాగింది. సంయుక్త కిసాన్ మోర్చా, అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త పిలుపుతో పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆందోళనకారులు కేంద్ర ప్రభుత్వ ధోరణులపై సమరభేరీ మోగించారు.అంబేద్కర్ సెంటర్ నుండి ప్రారంభమైన భారీ ర్యాలీ టూ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ఉత్సాహంగా సాగింది. అనంతరం ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నాయకులు, కార్యకర్తలు భారీ రాస్తారోకో చేపట్టి కేంద్రానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. నిరసనకారులను పోలీసులు అరెస్టు చేయగా, కార్మికులు, రైతులు, సామాన్య ప్రజలు స్వచ్ఛందంగా అరెస్టయ్యేందుకు ముందుకు రావడం గమనార్హం.అరెస్టుల అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో పలువురు అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలు కార్మిక, కర్షక వర్గాల నడ్డి విరుస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. ప్రజల కష్టార్జితాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. నిత్యావసర ధరల పెరుగుదల, ఉద్యోగాల కోత, రైతు వ్యతిరేక ధోరణులతో సామాన్యుడి జీవితం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే తన ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని లేకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ప్రజల సమస్యలపై అన్ని వర్గాలు ఏకమై పోరాడితేనే కేంద్రం దిగివస్తుందని స్పష్టం చేశారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రజలను చైతన్యపరిచి, రాబోయే పోరాటాల్లో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రజాపంథా నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి పాల్గొని ప్రసంగించారు.అలాగే వివిధ పార్టీలు, సంఘాల నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, తుమ్మ విష్ణువర్ధన్, సీ.వై.పుల్లయ్య, జీ.రామయ్య, సింగు నరసింహారావు, తోట రామాంజనేయులు, యర్రా శ్రీనివాస్, మెరుగు సత్యనారాయణ, బోంతు రాంబాబు, మాదినేని రమేష్, వై.విక్రమ్, నాగరాజు, గోవిందరావు, వెంకన్న, నరాల నరేష్, ఆవుల అశోక్, పాషా, దండ జ్యోతి రెడ్డి, తొట్టి కోమరయ్య, రాంబాబు, లక్ష్మినారాయణ, శిరోమణి, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి






**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై కార్మికులు, రైతులు ఐక్యంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. సోమవారం కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీల పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు నాయకులు దంతూరి జ్ఞానేశ్వర్, రామకృష్ణ, మర్రిపల్లి సాయి కిరణ్, పంజాల సాయి, మల్లెల అంజయ్య, రమేష్, పాండు, ఐలయ్య, రాములు, నరసింహ, జగన్, భాస్కర్ పాల్గొన్నారు.

**బీబీనగర్ లో జైలుభరో**

**ముద్ర, బీబీనగర్ :** కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేసి విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోని విబిజి గ్రాంజీ స్కీం ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బీబీనగర్ మండల కేంద్రంలో జైలుభరో కార్యక్రమం సందర్భంగా స్థానిక రహదారి బంగ్లా నుండి బ్రాహ్మణపల్లి రోడ్డు అటు నుండి పోచంపల్లి రోడ్డు చౌరస్తా వరకు ప్రదర్శన నిర్వహించి ఆ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మూడు దిక్కుల రోడ్లలో వాహనాలు నిలిచి పోవడంతో పోలీసులు వచ్చి ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లారు. అనంతరం వ్యక్తిగతకు పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బండారు శ్రావణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, రైతు సంఘం మండల నాయకులు బండారు శ్రీరాములు, రేసు రామచంద్రారెడ్డి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పొట్ట యాదమ్మ, నాయకులు సయ్యద్ ఉమర్, మేకల బాబు, బాలబోయిన జంగయ్య, సందెల రాజేష్, ఎర్రోళ్ల ఉపేందర్, లోకదాస్ పవన్, నాంపల్లి భాస్కర్, సిల్వేరు రమేష్, రామారావు, మార్కండేయ, బాలరాజు పాల్గొన్నారు.

**భువనగిరిలో..**

**ముద్ర ప్రతినిధి యాదాద్రి భువనగిరి :** సిఐటియు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భువనగిరి జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ,కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా జైల్ బరో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్మిక , రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జూనియర్ కాలేజీ నుంచి ప్రారంభమైన ర్యాలీ ర్యాలీ రైతు బజార్ వద్ద, రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు లు. మాట్లాడారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, జిఎంబిఎస్ జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాసహాయ కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సిలువేరు రామకుమారి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గంధ మల్ల మాతయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి, అన్నం పట్ల కృష్ణ, రజక సంఘం సంఘం జిల్లా కార్యదర్శి వడ్డబోయిన వెంకటేశం,, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బందెల ఎల్లయ్య బర్ల వెంకటేశం, కల్లూరు నాగమణి, వనం రాజు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి సలీం, మాయరాణి, మచ్చ భాస్కర్ ,వల్దాసు అంజయ్య, నరాల నరసింహ, లలిత, కొండాపురం యాదగిరి ఎస్ఎఫ్ఐ నాయకులు చింతల శివ, ఈర్ల రాహుల్, మద్దబోయిన సుందరయ్య పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు మరువలేనివి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



**ముద్ర, నల్లబెల్లి:** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి దశదిన కర్మ, సంస్మరణ సభలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు భావోద్వేగానికి గురయ్యారు. సుదర్శన్ రెడ్డితో తనకున్న 25 ఏళ్ల అనుబంధాన్ని, తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు.తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు, ఆస్తులు, పదవులను సైతం లెక్కచేయకుండా సుదర్శన్ రెడ్డి పోరాడారని కొనియాడారు. మానుకోట, పరకాల, స్టేషన్ ఘనపూర్ తదితర ఉద్యమాల్లో ఆయన కీలకంగా పనిచేశారని తెలిపారు. నర్సంపేట అభివృద్ధితో పాటు దేవాదుల నీటిని రామప్ప, పాకాల, లక్నవరం చెరువులకు తీసుకురావడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు.ఉద్యమ సమయంలో తాను గాయపడినప్పుడు సుదర్శన్ రెడ్డి ఆసుపత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడారని హరీశ్ రావు గుర్తుచేసుకున్నారు. "అదే ఆసుపత్రిలో ఆయనను విగతజీవిగా చూస్తానని కలలో కూడా ఊహించలేదు" అంటూ భావోద్వేగానికి లోనయ్యారు.చివరి శ్వాస వరకు ప్రజల కోసం, పార్టీ కోసం పోరాడిన సుదర్శన్ రెడ్డి సేవలు, జ్ఞాపకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని హరీశ్ రావు అన్నారు.

# మత్స్యకారులకు తెలంగాణ ప్రభుత్వ భరోసా

### 4.21 లక్షల మంది మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా
### ప్రమాద మరణం, వైకల్యానికి రూ.5 లక్షల వరకు పరిహారం



**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు.18 నుంచి 70 ఏళ్ల వయస్సు గల నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని మంత్రి తెలిపారు. ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యానికి గురైన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే పథకం ప్రధాన ఉద్దేశమన్నారు.ప్రభుత్వమే ప్రీమియం భారంఒక్కో లబ్ధిదారునికి రూ.79.96 బీమా ప్రీమియం ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ప్రీమియాన్ని భరిస్తాయని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21.34 కోట్లకు పైగా చెల్లించనుందని తెలిపారు. దీంతో అర్హులైన మత్స్యకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు.బీమా పథకం ద్వారా ప్రయోజనాలుప్రమాదవశాత్తు మరణం: రూ.5 లక్షలు శాశ్వత సంపూర్ణ వైకల్యం: రూ.5 లక్షలుశాశ్వత పాక్షిక వైకల్యం: రూ.2.50 లక్షలుప్రమాదవశాత్తు ఆసుపత్రిలో చికిత్స: గరిష్ఠంగా రూ.25 వేల వరకు వైద్య సహాయంజూన్ 1 నుంచి బీమా రక్షణ2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చే పాలసీ కాలంలో అర్హులైన ప్రతి నమోదిత మత్స్యకారుడికి నిరంతర బీమా రక్షణ అందేలా మత్స్యశాఖ చర్యలు చేపట్టిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.ప్రమాద సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు, వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో గ్రూప్ ప్రమాద బీమా పథకం కీలకమైనదని పేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా నమోదిత మత్స్యకారులు, వారి కుటుంబాలకు సమగ్ర సామాజిక భద్రత, ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

# మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గోరింటాకు వేడుక



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆషాఢమాసం పురస్కరించుకొని గోరింటాకు పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆచారాలలో భాగంగా ఆషాఢమాసంలో గోరింటాకు పండుగ నిర్వహించిన మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్యను అభినందించారు.కార్యక్రమంలో పాలు పంచుకున్న ప్రతి మహిళ కాంగ్రెస్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ తెలుగు సంస్కృతిలో గోరింటాకు పండుగ ప్రత్యేకమైన అందమైన ఆచారం అని,ముఖ్యంగా ఆషాఢమాసంలో మహిళలు చేతులకు,కాళ్ళకు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని, ఇది కేవలం అలంకారమే కాకుండా ఆరోగ్యం, సాంప్రదాయానికి ప్రతీక అని,గోరింటాకు పండుగ మనబాంధవ్యాలను కలుపుతుందని, ఈ పండుగ మన పూర్వీకులు అందించిన అందమైన, ఆనందకరమైన సాంస్కృతిక సంపద అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు లలిత,మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, ఇందుమతి, మాజీ కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల, పాకాలపాటి విజయ, కన్నం వైష్ణవి,రుద్రగాని శ్రీదేవి,కరుణ, గజ్జల లక్ష్మి,దామా స్వరూప ,మందపల్లి నాగమణి,ఊరుకొండ చంద్రిక,కొత్తపల్లి పుష్ప,బలుసు లక్ష్మి, రేఖా భార్గవి,మంగ, సుగుణ, సుగుణ,తదితర నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ షాపులు బహిరంగ వేలం

**ముద్ర, సూర్యాపేట:** సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న పలు మున్సిపల్ షాపులను బహిరంగ వేలం ద్వారా అద్దెకు ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హన్మంత్ రెడ్డి తెలిపారు. పాత మున్సిపల్ కార్యాలయంలోని గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్ షాపులతో పాటు స్వామి వివేకానంద షాపింగ్ కాంప్లెక్స్, కిషన్‌గంజ్ కూరగాయల మార్కెట్, అలంకార్ థియేటర్ ఎదురుగా ఉన్న షాపులను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి గల వ్యక్తులు మున్సిపల్ కార్యాలయ పని వేళల్లో రూ.50 చెల్లించి దరఖాస్తు ఫారం పొందాలని కమిషనర్ సూచించారు. నిబంధనలు, షరతులకు లోబడి పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. 19వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలానికి సంబంధించిన ఇతర వివరాల కోసం కార్యాలయ పని వేళల్లో మున్సిపల్ రెవెన్యూ విభాగాన్ని సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

# ఆర్ఎంపీ వైద్యం వికటించి బాలిక మృతి

### ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** ఆర్ఎంపీ ఇచ్చిన వైద్యం వికటించి ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక మృతి చెందిన విషాద సంఘటన కొణిజర్ల మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... లింగగూడెం గ్రామానికి చెందిన చల్లా హేమశ్రీ (13) కొణిజర్లలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 8వ తరగతి చదువుతోంది. ఆదివారం ఊరిలో జరిగిన బోనాల పండుగలో బాలిక రోజంతా స్నేహితులు, బంధువులతో కలిసి ఉత్సాహంగా గడిపింది.అయితే సాయంత్రం వేళ హేమశ్రీకి జలుబు, దగ్గు రావడంతో కుటుంబ సభ్యులు గ్రామంలోని ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆర్ఎంపీ ఆమెకు ఒక ఇంజెక్షన్ ఇచ్చి కొన్ని మందులు ఇచ్చాడు. ఆ మందులు వాడిన కొద్దిసేపటికే బాలిక ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది.పరిస్థితి విషమించడంతో వెంటనే కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలికను పరీక్షించిన వైద్యులు.. మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు ధృవీకరించారు.ఆర్ఎంపీ అధిక డోస్ ఇంజెక్షన్ ఇవ్వడం వల్లే తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆర్ఎంపీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడి సర్దిజెప్పారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు బాలిక మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పండుగ పూట హుషారుగా తిరిగిన బాలిక హఠాత్తుగా మృతి చెందడంతో లింగగూడెంలో తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి.

# భువనగిరి పట్టణ ముదిరాజ్ సంఘం కార్యవర్గం





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా ఎనబోయిన జహంగీర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా నీల శ్రీనివాస్ ముదిరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక పెద్దమ్మ తల్లి దేవాలయంలో జరిగిన సమావేశంలో ముదిరాజ్ కుల పెద్దలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతకు అన్ని విధాలుగా న్యాయం చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి నీల శ్రీనివాస్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.22న శనివారం పెద్దమ్మ తల్లికి బోనాలు, 23న ఇతర దేవతలకు బోనాలు.. ఈనెల 22న భువనగిరి పట్టణంలో అన్ని వార్డుల ముదిరాజ్ బంధువులు పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించనున్నట్లు నిర్ణయించారు. 23న వార్డులలోని ఇతర దేవతలకు బోనాలు సమర్పించినట్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట నరసింహ, నాయకులు కుక్కదువ్వ సోమయ్య, సాదు విజయ్ కుమార్, కొలుపుల వివేకానంద, జంగిటి రవి, పిట్టల బాలరాజు, గుర్రాల శ్రీనివాస్, ఉడుత భాస్కర్, తుమ్మల నాగేష్, గుర్రాల శివ నాగేందర్, కనక బాలరాజు, కొలుపుల నాగరాజు, తుపాకుల సురేష్, చాగంటి సురేష్, శంకర్, జహంగీర్, పిట్టల రాములు, మాటూరి అశోక్, మల్యాల వేణుమాధవ్, సాదు వేణు, వెంకటేష్, రమేష్, చింతకాయల హరీష్, జహంగీర్, ఇండ్ల కృష్ణ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 11.08.2026
www.mudranews.in | @mudranews



**కడుపు ఉబ్బరం :**



గోరువెచ్చని నీటితో ఉపశమనంకడుపు ఉబ్బరంగా అనిపించినప్పుడు గోరువెచ్చని నీటిని నెమ్మదిగా తాగడం కొంత ఉపశమనం కలిగించవచ్చు. ఇది జీర్ణక్రియకు సహాయపడటంతో పాటు కడుపులో అసౌకర్యాన్ని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. అయితే ఉబ్బరం తరచుగా వస్తే కారణాన్ని గుర్తించడం ముఖ్యం.

# 44 కార్మిక చట్టాలను అమలు చేయాలి

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిస్టాపురం లక్ష్మణ్**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జైల్భరో కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పోరేట్ బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతూ ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వేలు బ్యాంకులు విమానాయానం పోర్టులు ఎల్ఐసి తదితర పరిశ్రమలను బడా పారిశ్రామక వేత్తలకు కట్ట బేడుతున్నాడని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మిక వర్గం ఉపాధి లేక రోడ్డుపాలైతున్నారని పారిశ్రామివేత్తలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు కల్పిస్తూ కార్మిక వర్గానికి మాత్రం కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. అనేక పోరాటాలు త్యాగాలు బలిదానాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా మార్పులు చేసి కార్పొరేట్ సంస్థల యజమానులకు అనుకూలంగా మార్చడం జరిగిందన్నారు. 44 కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని కార్మికుల ప్రయోజనాలను చట్టాలను కాపాడాలని 27సార్లు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలు చేసిన కార్మిక వర్గం ఎన్ని పోరాటాలు చేసినా కేంద్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికులతో వివిధ ప్రైవేట్ పారిశ్రామల యాజమాన్యాలు వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయని అంగన్వాడి, ఆశ మధ్యాహ్న భోజనం కార్మికులంతా కేంద్ర ప్రభుత్వ స్కీం వర్కర్స్ లక్షలాదిమంది శ్రమ దోపిడికి గురవుతూ అతి తక్కువ వేతనాలతో ఎక్కువ గంటలు పని చేస్తున్నారన్నారు. రోజు కూలి చేసే కార్మికులు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న కార్మికులు మాత్రం చాలీచాలని కూలీతో బ్రతుకుతున్నారు ఇప్పటికైనా నాలుగు లేబర్ కోడులను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని లేనియెడల కార్మిక వర్గం అంతా ఏకమై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఇట్లా మల్లేశం కర్నాల చంద్రం సహకార దర్శి తపస్పల్లి బిక్షపతి బెక్కంటి సంపత్ గంగి రాజు కోశాధికారి బాలయ్య పట్టణ అధ్యక్షుడు చెక్క ఐలయ్య నాయకులు శ్రీను మల్లయ్య రమేష్ రాజు రాములు భూమయ్య వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం రాస్తారోకో, అరెస్ట్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమం చేస్తామని, పేదల పొట్టలు గొట్టి సంపన్నులకు సేవలు చేస్తున్న మోడీ నిరంకుశ విధానాలపై, లేబర్ కొడ్స్ రద్దు అయ్యే వరకు ఉద్యమం చేస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యం అడివయ్య హేచ్చరించారు. సోమవారం కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా జైలు భరో జాతీయ పిలుపులో భాగంగా మెదక్ పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం నుండి పోస్టు ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. రాస్తారోకో చేస్తున్న నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి అనంతరం విడుదల చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు యం అడివయ్య మాట్లాడుతూ... క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలపై దేశ వ్యాప్త ఉద్యమం చేస్తున్నామని అన్నారు. 12 ఏండ్ల నుండి దేశాన్ని పరిపాలిస్తున్న మోడీ దేశ సంపదను పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని విమర్శలు చేశారు. మతోన్మాద, కార్పొరేట్ విధానాలు అమలు చేసి ప్రజలపై భారలు వేసే హక్కు మోడీకి ఎక్కడిదని అన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కొడ్స్ ఎవ్వరి ప్రయోజనాల కోసం అమలు చేస్తున్నారని అన్నారు. లేబర్ కొడ్స్ అమలు చేయడం అంటే కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టడమే అవుతుందని అన్నారు. జిల్లా కార్యదర్శి కె మల్లేశం, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జె సంతోష్, వర్కర్స్ స్టీరింగ్ కమిటీ సభ్యులు గణేష్ రెడ్డి, నాయకులు యశోద, కవిత, దుర్గ, దేవేయ్య, యాదగిరి, వెంకన్న, దాసు, స్వరూప,షౌకత్, సిద్దవ్వ, సాయిలు, ప్రమీల,కుమ్మరి దుర్గయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు

# కొత్తపల్లి వద్ద బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు ఎప్పుడు?

**మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ – బొడ్మెట్‌పల్లి వెళ్లే ప్రధాన మార్గంలోని కొత్తపల్లి వద్ద బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంపై మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పాపన్నపేట మండల నాయకులతో కలిసి కొత్తపల్లి వద్ద బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనదారులతో మాట్లాడి, బ్రిడ్జి వద్ద ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.1.40 కోట్లతో కొత్తపల్లి వద్ద బ్రిడ్జి నిర్మించామని తెలిపారు. సిట్టింగ్ఎమ్మెల్యే కొత్తపల్లి బ్రిడ్జిపై కనీసం అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం దారుణమన్నారు. కొత్తపల్లి బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు.వారం రోజుల్లోగా అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని పద్మా దేవేందర్ రెడ్డి హెచ్చరించారు. వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, కొడపాక సర్పంచ్ పంకజ కాశీనాథ్‌రావు, మాజీ సర్పంచ్‌లు శ్రీనాథ్‌రావు, బద్రి మల్లేశం, నాయకులు సోములు, దుర్గయ్య, అనిల్‌రెడ్డి, బాబాగౌడ్, అంతోని, శ్రీనివాస్‌గౌడ్, మేడిశెట్టి రాము, దండం సామేల్, మల్లేశం, చంద్రన్న తదితరులున్నారు. అంతకుముందు హవేలి ఘనపూర్, పాపన్నపేట, రామాయంపేటలో పలువురిని పరామర్శించారు.

# కేసీఆర్ ఉచిత శిక్షణా శిబిరం

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆధ్వర్యంలో సిద్దిపేట లో ఉచిత కానిస్టేబుల్ శిక్షణ ఏర్పాటు త్వరలో దరఖాస్తు లు తీసుకోని అర్హత పరీక్ష నిర్వహిస్తాం**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** నిరుద్యోగులు, విద్యార్థులు ఉద్యోగాల కోసం ఆందోళన చేపడతామని హెచ్చరిస్తేనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోయి వచ్చిందని అందుకే ఆమాత్రమైన పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు పాల సాయిరాం, ఎడ్ల సోమిరెడ్డిలు అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పోలీసు ఉద్యోగాల కోసం సిద్దమవుతున్న నిరుద్యోగుల కోసం మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆధ్వర్యంలో కెసిఆర్ ఉచిత కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో నిర్వహించిన కేసీఆర్ ఉచిత కోచింగ్ సెంటర్ల ద్వారా ఎంతోమంది పోలీసు కానిస్టేబుల్, గ్రూప్స్, ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. చదువుపై ఆసక్తి ఉండి కోచింగ్ సెంటర్లకు ఫీజులు భరించలేక వెళ్లలేని వారికోసం హరీష్ రావు ఉచిత కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కోచింగ్ సెంటర్లో అడ్మిషన్ల కోసం త్వరలో ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించి ఎంపిక చేస్తామని... దరఖాస్తు లు కూడా తీసుకుంటామని చెప్పారు, నిరుద్యోగ విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ మీడియా సమావేశంలో బిఆర్.ఎస్ నాయకులు మోహిజ్ ,పాపయ్య, సిద్దిపేట అర్బన్ మండలం ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు నరేష్, సర్పంచ్ లు నరేందర్ రెడ్డి, దేవయ్య, యువజన నాయకులు నరేందర్ రెడ్డి, రమేష్ పలువురు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం



**మద్ర, దేవరకొండ:** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య మాట్లాడుతూబ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులు మతోన్మాద శక్తుల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని నల్ల వెంకటయ్య పిలుపునిచ్చారు.సోమవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలుకు ఫైనల్ రూల్స్‌ను నోటిఫై చేయడం, విద్యుత్ సవరణ బిల్లు–2025, విత్తన చట్టానికి సవరణలు వంటి చర్యలకు పూనుకోవడం ద్వారా పెట్టుబడిదారులకు అనుకూలంగా విధానాలను తీసుకొస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామావత్. జబ్బర్ రామ వత్తు రాజు నాయక్ శారద సంధ్య శ్రీరాములు నాగమణి మమతా నాయక్ రాందాస్ శంకర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సోమవారం పర్యటించి పారిశుధ్యం, డ్రైనేజీ, నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రంతో కలిసి జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, దోమల నివారణకు పిచికారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం పట్టణంలోని 3వ వార్డు రంగధాంపల్లి బతుకమ్మ కుంటను పరిశీలించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నీరు కుంటలో కలవడంతో నీరు కలుషితమవుతోందని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఆయన కుంటను సందర్శించారు. డ్రైనేజీ నీరు కుంటలోకి చేరకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సూచించారు.అలాగే 1వ వార్డు లింగారెడ్డిపల్లిలో నూతన ఇంటి నిర్మాణానికి మంజూరైన అనుమతులకు విరుద్ధంగా నిర్మాణ పనులు చేపడుతున్నారన్న ఫిర్యాదు మేరకు కమిషనర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. అనుమతులకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని ఇంటి యజమానులను ఆదేశించారు.పట్టణంలో పారిశుధ్యం, ప్రజా సమస్యలు, అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు.కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వంగ తిరుమల్ రెడ్డి, ముత్యల కనకయ్య, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ: ఒకరు మృతి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ కొనగా ఒకరు మృతి చెందిన సంఘటన పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పాపన్నపేట గ్రామ పంచాయతీ కారోబార్ ఆకుల కృష్ణ (40) ద్విచక్రవాహనంపై బావ మరిది వెంకట్ తో మెదక్ నుండి వైపు పాపన్నపేట వైపు వెళుతున్న క్రమంలో అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన కటికే వారు ఇరువురు ద్విచక్రవాహనంపై నుండి మెదక్ వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో వెనుక కూర్చున్న కృష్ణ ఎగిరి రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావమైంది. సమాచారం అందుకున్న 108 అంబులెన్సులో క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కృష్ణ మృతి చెందినట్లు పరీక్షించిన డాక్టర్లు నిర్ధారించారు. కాగా మృతుడికి భార్య, ఓ కూతురు ఉన్నారు. పాపన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బీజేపీ గిరిజన మోర్చా జిల్లా కార్యవర్గం

**ముద్ర ప్రతినిధి, మెదక్:** బీజేపీ గిరిజన మోర్చా నూతన జిల్లా కార్యవర్గ సభ్యులకు బాధ్యత పత్రాలను జిల్లా అధ్యక్షులు వల్దాస్ మల్లేశం గౌడ్ అందజేశారు. భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు లావడియా రాములు నాయక్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శులుగా కుమార్ నాయక్, పుల్ సింగ్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులుగా రాజు నాయక్, మోహన్ నాయక్, ప్రకాశ్ నాయక్,పోచయ్య, జిల్లా కార్యదర్శులుగా లక్ష్మణ్, రమేష్ నాయక్, శివుల విఠల్ నాయక్,జిల్లా కోశాధికారిగా సంతోష్ నాయక్,సోషల్ మీడియా కన్వీనర్ గా నరేష్ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా నరేష్, రామ్ చందర్, గోప్య నాయక్, శర్మ నాయక్, శివలాల్, శ్రీకాంత్ లకు పత్రాలు అందజేశారు. ఈ eకార్యక్రమంలోబీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, గిరిజన మోర్చా జిల్లా ఇంచార్జీ మధుసూదన్, జిల్లా కార్యదర్శి బిక్షపతి, గిరిజన మోర్చా మాజీ అధ్యక్షులు రెడ్య నాయక్, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షులు ఖిచ్చి గ్యాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు పరీక్షలు




**ముద్ర ప్రతినిధి, మెదక్:** హవేలి ఘనపూర్ మండలం కూచన్ పల్లి హైస్కూల్లో కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు రెంజుకి షటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోకరాటే పరీక్షలు నిర్వహించారు. అతిథులుగా హవేలి ఘన్పూర్ మండల విద్యాధికారి ఎన్. మధుమోహన్ హాజరయ్యారు. పరీక్షలలో ఉత్తీర్ణులు అయిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటలు, మార్షల్ ఆర్ట్స్ వంటి విద్యలు నేర్చుకోవాలని సూచించారు. ఆడపిల్లలకు తమను తాము రక్షించుకోవడానికి మార్షల్ట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పరీక్షలకు పరీక్ష నిర్వాహకులుగా రెంజుకి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా ఫౌండర్ అండ్ డైరెక్టర్ నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇన్చార్జిలుగా దినాకర్, మల్లేశం మణివన్నం వ్యవహరించారు. స్థానిక కరాటే మాస్టర్ నాగేంద్ర భార్గవ్ పాల్గొన్నారు.

## నిధులు విడుదల చేయాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బస్వాపురం ప్రాజెక్టు నిర్వాసితులకి ఆర్ & ఆర్ ప్యాకేజి నిధులు విడుదల చేయాలని సోమవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి ఆర్థిక శాఖ కార్యదర్శికి ఆదేశాలిస్తానని చెప్పారు.

## మాలగడ్డ ముత్యాలమ్మ దేవస్థానంలో చోరీ

**ముద్ర, దేవరకొండ:** మాలగడ్డ ముత్యాలమ్మ దేవస్థానంలోని హుండీ తాళం పగలగొట్టి నగదు దొంగతనం చేసిన ఘటన సోమవారం జరిగింది. ఈ ఘటన సీసీ కెమెరాలో రికార్డు కావడంతో దృశ్యాల ఆధారంగా సంబంధిత వ్యక్తిని గుర్తించడం జరిగిందని ఈ విషయంపై దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో సీఐని కలిసి దేవస్థాన కమిటీ సభ్యులం పిటిషన్ సమర్పించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనికోరుతున్నట్లు మాలగడ్డ ముత్యాలమ్మ దేవస్థాన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555